వార్తసంధ్య

తెలుగు దిన పత్రిక

నిజం నిర్భయంగా మీ ముందుకు...

ఇజ్రాయెల్‌లో
తుది ఫలితాలు వెల్లడి..



6

ఏ చేను చూసినా ఏమున్నది ఆశ!



5

Published From : Rangareddy VOLUME : 01 Issue : 313 Saturday, 30-10-2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

Hyderabad, Mahbubnagar, Medak, Nalgonda, Nizamabad, Adilabad, Karimnagar, Warangal, Khammam, Bhadradri Kothagudem , Mahabubabad, Medchal--Malkajgiri, Yadadri Bhuvanagiri, Suryapet, Siddipet



02

భారత్‌కు 87 పరుగుల
భారీ ఓటమి!

- 49 బంతుల్లో 107 పరుగులతో చెలరేగిన గ్లెన్ ఫిలిప్స్
- బ్రేస్‌వెల్ మెరుపులు.. కివీస్ స్కోరు 259/7
- 4 వికెట్లతో భారత బ్యాటింగ్‌ను దెబ్బతీసిన డఫీ
- 172 పరుగులకే పరిమితమైన టీమ్‌ఇండియా
- ఐదు టీ20ల సిరీస్‌లో కివీస్‌కు తొలి విజయం
- 3--1తో ఆధిక్యంలో భారత్.. ఆదివారం చివరి పోరు

మియాపూర్ భూములు
పేదలకే!

లక్షా 50 వేల కోట్ల భూములు కాపాడాం



- నాడు కొట్టేద్దామని చూస్తే మేం అడ్డుకున్నాం
- కబ్జాకు కేసీఆర్‌తోపాటు బంధువుల యత్నం
- 550 ఎకరాలను రెండు రోజుల్లో స్వాధీనం చేసుకుంటాం
- ఈ భూములను పేదల సంక్షేమానికి వాడుకుంటాం
- సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపించాం
- కబ్జాపై అసెంబ్లీలో చర్చిద్దాం.. రండి
- ఆక్రమణదారులను ఎవరినీ వదలం
- దిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,

మియాపూర్‌లోని 550 ఎకరాల ప్రభుత్వ భూములను రెండు రోజుల్లో స్వాధీనం చేసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ భూములపై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, దాదాపు రూ.50 వేల కోట్ల విలువైన ఆస్తిని కాపాడుకోగలిగామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన అనుచరులు రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ భూములను పరిరక్షించడమే కాకుండా వాటిని పేదల సంక్షేమానికి వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయస్థానాల్లో సమర్థవంతంగా పోరాడి ఇప్పటివరకు రూ.1.50 లక్షల కోట్ల విలువైన భూములను కాపాడినట్లు -మిగతా 2 లో



ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే
కాంగ్రెస్ లక్ష్యం

- హైదరాబాద్‌లో నిరసనకు ముందు అమిత్ షా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- ఓటు హక్కును కాపాడేందుకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పోరాటం
- జాతీయ జనగణనలో బీసీ కులగణనను వెంటనే చేర్చాలి
- ప్రభుత్వ భూములను కాపాడటం చారిత్రాత్మక విజయమన్న పొన్నం
- స్వతంత్ర వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు
- తెలంగాణ అమరవీరులను అవమానించినందుకు మోదీ, అమిత్ షా క్షమాపణ చెప్పాలి
- బీసీల గణాంకాలతోనే రిజర్వేషన్లు, సంక్షేమానికి సరైన ప్రణాళిక
- ఓటర్ల జాబితాలో అక్రమాలపై న్యాయపోరాటం తప్పదని స్పష్టీకరణ

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు 'ఓట్ బచావో'--దేశ్ బచావో', 'ఓట్ చోర్--గద్దీ ఛోడ్' నినాదాలతో కాంగ్రెస్ దేశవ్యాప్తంగా పోరాటం సాగిస్తోందన్నారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం తప్పదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటం ఫలించి వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించగలిగామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, న్యాయవ్యవస్థకు తెలంగాణ ప్రజల -మిగతా 2 లో



02

మళ్లీ పగ్గాలిస్తే యూపీలో
యూసీసీ అమలు

- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం
- ధీమా వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- ప్రతిపక్షాల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు
- రామమందిరం, ఓటర్ల జాబితా అంశాలపై ప్రస్తావన
- యూపీలో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరన్న అమిత్ షా

జనవరి 25 నుంచి జనగణన

- ఫిబ్రవరి 28 వరకు దేశవ్యాప్తంగా నిర్వహణ
- ఎన్నికలు జరిగే యూపీ, మణిపూర్, గోవా, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు మినహాయింపు
- మంచుకురిసే వేళలో జమ్ముకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో జనగణన ఉండదు
- మార్చి 1 నుంచి 5 వరకు సవరణాత్మక జనగణన

02



9 రైస్ డిపోలపై దాడులు..
అసలు బియ్యం బాగోతం ఎక్కడ?

-బస్తా పై 26 కిలోల ముద్ర .. బస్తాలో 23 కిలోలే!


-10 వేల క్వింటాళ్లకు పైగా బియ్యం నిల్వలు ఉన్నట్లు అంచనా

-కేసులు నమోదు చేశామంటున్న అధికారులు.. పూర్తి వివరాలు వెల్లడించడంలో జాప్యం ఎందుకు?

-దాడులు చేసి వదిలేస్తారా? లేక బియ్యం అక్రమాల గుట్టు విప్పుతారా?

హైదరాబాద్ (వార్త సంధ్య):

బియ్యం బస్తాలో బరువు మాయం.. సన్న బియ్యం పేరుతో దొడ్డు బియ్యం విక్రయాల ఆరోపణలు.. మార్కెట్లో విపరీతంగా పెరుగుతున్న ధరలు.. మరోవైపు రైస్ డిపోలపై అధికారుల దాడులు! కర్మన్‌ఘాట్ కేంద్రంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తొలుత 25 కిలోల బస్తాలో 22 కిలోలే ఉంటున్నాయనే అనుమానాలు వ్యక్తమైతే, తాజాగా 26 కిలోలుగా ముద్రించిన బస్తాలో తూకం వేయగా 23 కిలోలే ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు అధికారులు వెల్లడించడం విస్తుపోయే అంశం. తొమ్మిది రైస్ డిపోలపై దాడులు నిర్వహించి, భారీ స్థాయిలో బియ్యం నిల్వలను గుర్తించినట్లు సంబంధిత జిల్లా పౌరసరఫరాల అధికారి వనజాత రెడ్డి 'వార్త సంధ్య' ప్రతినిధికి తెలిపారు. అయితే దాడులు జరిగి మూడు రోజులు గడుస్తున్నా పూర్తి వివరాలు, పట్టుబడిన బియ్యం పరిమాణం, అక్రమాల స్వరూపం, తదుపరి చర్యలపై స్పష్టమైన ప్రకటన రాకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు ఈ బియ్యం బాగోతం వెనుక ఉన్నదెవరు? అధికారులు దాడులు చేసి చేతులు దులుపుకుంటారా? లేక పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను బయటపెడతారా? అనేది తెలియాల్సి ఉంది.



తొమ్మిది డిపోలపై ఏకకాలంలో దాడులు!

కర్మన్‌ఘాట్ ప్రాంతంలోని రైస్ డిపోలపై అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు పౌరసరఫరాల శాఖ అధికారి వనజాత రెడ్డి వెల్లడించారు. మొత్తం తొమ్మిది రైస్ డిపోలపై దాడులు నిర్వహించినట్లు, ప్రతి డిపోలో సుమారు ఐదు వేల బస్తాల వరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ తొమ్మిది డిపోల్లో కలిపి పదివేల క్వింటాళ్లకు పైగా బియ్యం నిల్వలు ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని వివరించారు. పూర్తి లెక్కలు, తనిఖీల నివేదికలు మరో రెండు రోజుల్లో వెల్లడిస్తామని వార్త సంధ్య ప్రతినిధికి తెలిపారు. అయితే ఇంత పెద్ద స్థాయిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఇప్పటివరకు పూర్తి వివరాలను ఎందుకు వెల్లడించలేకపోతున్నారన్నది ప్రశ్నగా మారింది.

బస్తాపై 26 కిలోల ముద్ర .. బస్తాలో 23 కిలోలే!

ఈ దాడులకు ప్రధాన కారణం వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులేనని అధికారులు తెలిపారు. బియ్యం బస్తాపై 26 కిలోల బరువు ఉన్నట్లు ముద్రించి విక్రయిస్తున్నప్పటికీ, తూకం వేయగా 23 కిలోలే వస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. అంటే ఒక్కో బస్తాలో మూడు కిలోల వ్యత్యాసం కనిపిస్తోంది. ఇది ప్యాకింగ్ సమయంలోనే జరుగుతోందా? లేక ఇతర కారణాల వల్ల జరుగుతోందా? అన్నది తేలాల్సి ఉంది. బస్తాపై ఒక బరువు ముద్రించి, వాస్తవంగా మరో బరువు అందిస్తే అది వినియోగదారుడి హక్కులకు భంగం కలిగించడమే. ఇలాంటి వ్యత్యాసాలు ఎన్ని బస్తాల్లో ఉన్నాయి? ఎంతకాలంగా ఈ విధానం కొనసాగుతోంది?

-మిగతా 7 లో



5న సింగరేణి కార్మికులకు
దీపావళి బోనస్

- కార్మికులకు తీపి కబురు చెప్పిన ఉప ముఖ్యమంత్రి బట్టి
- ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 దీపావళి బోనస్
- రూ.419 కోట్లు చెల్లింపులకు సర్వం సిద్ధం
- 38 వేల మంది కార్మికులకు అందనున్న బోనస్

సింగరేణి ప్రతినిధి అక్టోబర్ 30(వార్త సంధ్య)

గత కొన్ని రోజుల క్రితం లాభాల వాటా తోపాటు దసరా అడ్వాన్సును సింగరేణి యాజమాన్యం కార్మికులకు అందించింది. ప్రస్తుతం సింగరేణి కార్మికులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క శుక్రవారం మరో తీపి కబురు వినిపించారు. నవంబర్ 5న దీపావళి బోనస్ ను చెల్లించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ పెర్ఫార్మెన్స్ లింక్డ్

-మిగతా 2 లో



భారత్‌లో
హైఅలర్ట్!

- భూటాన్‌లోని షింటాపు సరస్సు ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు
- పశ్చిమబెంగాల్, అస్సాంలోని పలు ప్రాంతాలకు ముప్పు
- గాసా త్సాచు వేడినీటి బుగ్గ వద్ద సౌకర్యాలు ధ్వంసం
- ముందస్తు చర్యలతో తప్పిన ప్రాణనష్టం
- ధుబ్రి, డార్జిలింగ్, అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాలకు హెచ్చరికలు
- సంకోష్ నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు

02

దేశం కష్టాల్లో ఉంటే విపక్షాలకు సంతోషం!



- ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు
- దేశంలో వదంతులు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపణ
- ఇరాన్--అమెరికా ఉద్రిక్తతల వేళ రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
- ఎరువులు, గ్యాస్ కొరతపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వ్యాఖ్యలు
- రైతులపై అంతర్జాతీయ ఎరువుల ధరల భారం పడనివ్వం
- పీఎం కిసాన్ 24వ విడతలో రూ.19 వేల కోట్ల నిధుల విడుదల
- 9.34 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమ అయిన పెట్టుబడి సాయం

02

వార్తసంధ్య
www.vaarthasandhya.com

భారత్‌కు 87 పరుగుల భారీ ఓటమి!



క్రీడా విభాగం:
ఐదు టీ20ల సిరీస్‌లో టీమ్‌ఇండియాకు తొలి ఓటమి ఎదురైంది. నాలుగో టీ20లో న్యూజిలాండ్ బ్యాటర్లు గ్లెన్ ఫిలిప్స్, మైకేల్ బ్రేస్‌వెల్ విధ్వంసకర ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో భారత్ 87 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైంది. తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 172 పరుగులకే పరిమితమైంది. ఇప్పటికే తొలి మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్.. ఈ ఓటమితో 3-1 ఆధిక్యానికి పరిమితమైంది. టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. టిమ్ సీఫర్ట్ (3), డారిల్ మిచెల్ (24) త్వరగా వెనుదిరిగారు. మరో ఓపెనర్ ఫిన్ అలెన్ 31 పరుగులతో వేగంగా ఆడాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన గ్లెన్ ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 49 బంతుల్లో ఆరు ఫోర్లు, పది సిక్సర్లతో 107 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతడికి మైకేల్ బ్రేస్‌వెల్ అండగా నిలిచాడు. బ్రేస్‌వెల్ కేవలం 25 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఆరు సిక్సర్లతో 65 పరుగులు సాధించాడు. వీరిద్దరి ధాటికి న్యూజిలాండ్ భారీ స్కోరు నమోదు చేసింది.260 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు తొలి ఓవర్‌లోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ పరుగులేమీ చేయకుండానే ఔటయ్యారు. దీంతో టీమ్‌ఇండియా తీవ్ర ఒత్తిడిలో పడింది. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (6) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. నితీశ్ కుమార్ రెడ్డి (5), అక్షర్ పటేల్ (3) నిరాశపరచడంతో భారత్ కష్టాల్లో పడింది. ఓ వైపు వికెట్లు పడుతున్నా తిలక్ వర్మ పోరాటం కొనసాగించాడు. 35 బంతుల్లో 35 పరుగులు చేశాడు. నామన్ ధీర్ 13 బంతుల్లో 28 పరుగులతో వేగంగా ఆడాడు. అయితే భారీ లక్ష్యం ముందు ఈ ప్రయత్నాలు సరిపోలేదు. కీలక బ్యాటర్లు వరుసగా పెవిలియన్ చేరడంతో భారత్ విజయావకాశాలు దెబ్బతిన్నాయి. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ నాలుగు వికెట్లు పడగొట్టి భారత బ్యాటింగ్ పతనాన్ని శాసించగా, మిచెల్ సాంట్నర్ రెండు వికెట్లు తీశాడు. ఈ విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌లో తొలి గెలుపును అందుకుంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు గెలిచి సిరీస్‌ను ఖరారు చేసుకున్న భారత్ 3-1తో ఆధిక్యంలో కొనసాగుతోంది. చివరి టీ20లో గెలిచి సిరీస్‌ను 4-1తో ముగించాలని టీమ్‌ఇండియా లక్ష్యంగా పెట్టుకుంది.

మళ్లీ పగ్గాలిస్తే యూపీలో యూసీసీ అమలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీదే విజయం
ధీమా వ్యక్తం చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
ప్రతిపక్షాల ఆరోపణలపై సమాజ్‌వాదీ పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు
రామమందిరం, ఓటర్ల జాబితా అంశాలపై ప్రస్తావన
యూపీలో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరన్న అమిత్ షా



లిలక్నో:
ఉత్తరప్రదేశ్లో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా శుక్రవారం తెలిపారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారంనాడిక్కడ జరిగిన బీజేపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో రామ మందిరం అంశం, ఓటర్ల జాబితాలో అవకతవకల ఆరోపణలపై సమాజ్వాదీ పార్టీతోపాటు ఇతర ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్లో బీజేపీ ప్రభుత్వాన్ని కదిలించలేరని, ప్రభుత్వం అక్కడ తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకుందని షా అన్నారు. ఈసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఉత్తరప్రదేశ్లో యుసిసి అమలు చేస్తామని, ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో యుసిసి అమల్లో ఉందని అన్నారు. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన రోజంతా సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి షా ప్రారంభించారు. పార్టీ సిద్ధాంతకర్తలు శ్యామ ప్రసాద్ ముఖర్జీ, దీన్దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జనవరి 25 నుంచి జనగణన

న్యూఢిల్లీ:
ఎన్నికలు జరిగే ప్రాంతాలు, మంచు ప్రభావిత ప్రాంతాలు మినహా దేశవ్యాప్తంగా జనగణనను (పాపులేషన్ సెన్సస్) 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నట్లు జనాభా లెక్కల కమిషనర్ శుక్రవారం ప్రకటించారు. అధికారిక నోటిఫికేషన్ ప్రకారం, జనాభా లెక్కలకు ప్రామాణిక తేదీగా 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను (00:00) నిర్ణయించారు. మణిపూర్ (తదుపరి ప్రకటన వరకు), గోవా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్, హిమాచల్ప్రదేశ్, జమ్ముకశ్మీర్లో మంచుతో ప్రభావితమైన ఏక కాలంలో లెక్కలు నిర్వహించలేని ప్రాంతాలు మినహా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కలు నిర్వహించనునట్లు భారత రిజిస్ట్రార్ జనరల్, జనాభా లెక్కల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ జారీ చేసిన నోటిఫికేషన్లో పేర్కొన్నారు. జనాభా లెక్కల సవరణ దశను 2027 మార్చి 1 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటింటి జనాభా లెక్కంపు ప్రారంభానికి ముందు 2027 జనవరి 10 నుంచి 24 వరకు ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని నోటిఫికేషన్లో పేర్కొన్నారు.

బీజేపీతో పొత్తుకు బీఆర్ఎస్ ఆరాటం

-చంద్రబాబును పొగడటం వెనుక రాజకీయ వ్యూహం
-గతంలో విమర్శలు.. ఇప్పుడు ప్రశంసలు ఎందుకని ప్రశ్న
-బీజేపీతో సయోధ్య కోసమే ఈ వైఖరని ఆరోపణ
-కాంగ్రెస్‌పై విమర్శలు.. బీజేపీ, టీడీపీలపై మౌనం
-బీఆర్ఎస్ సోషల్ మీడియా తీరుపై మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు
-ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించే ధైర్యం ఉందా?
-బావాబామ్మర్దుల చీకటి ఒప్పందాలను ఆధారాలతో బయటపెడతాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి
బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ఆరాటపడుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. గతంలో టీడీపీ అధినేత చంద్రబాబును తీవ్రంగా విమర్శించిన బీఆర్ఎస్ నేతలే ఇప్పుడు ఆయనను పొగుడుతూ ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే రాజకీయ వ్యూహంలో భాగంగానే ఈ సయోధ్య ప్రయత్నాలు సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌పై నిత్యం విమర్శలు చేసే బీఆర్ఎస్ సోషల్ మీడియా, బీజేపీ, టీడీపీలను మాత్రం ప్రశ్నించకపోవడం వెనుక రహస్య ఒప్పందం ఉందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు నిజంగా రాజకీయ ధైర్యం ఉంటే ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య కొనసాగుతున్నాయని ఆరోపిస్తున్న చీకటి రాజకీయ ఒప్పందాలను తగిన ఆధారాలతో ప్రజల ముందు బయటపెడతామని స్పష్టం చేశారు.

మియాపూర్ భూములు పేదలకే!

మొదటి తరువాయి

సీఎం తెలిపారు. మియాపూర్ భూముల విషయంలో గత మూడేళ్లుగా న్యాయవాదులతో సంప్రదింపులు జరుపుతూ బలమైన వాదనలు వినిపించామని చెప్పారు. తీర్పు వెలువడిన వెంటనే భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అవసరమైతే ఈ భూములను వేలం వేసి, వచ్చే నిధులను దళితులు, బహుజనులు, పేదల అభివృద్ధికి ఖర్చు చేస్తామని ప్రకటించారు. మియాపూర్ భూముల వ్యవహారంలో గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు తదితరుల పాత్రపై సీఎం ప్రస్తావించారు. కొందరు అధికారులు, ప్రైవేటు వ్యక్తులు కలిసి ప్రభుత్వ భూములను కాజేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో గతంలో కొందరు అధికారులు అరెస్టయ్యారని గుర్తుచేశారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల వెనుక ఎవరున్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని విలువైన ప్రభుత్వ భూములను గతంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ప్రయత్నాలు జరిగాయని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఐఎంజీ భూముల వ్యవహారంలోనూ న్యాయపోరాటం చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు తెలిపారు. కంచ గచ్చిబౌలిలో 400 ఎకరాలు, మామిడిపల్లిలో 450 ఎకరాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం పోరాడిందన్నారు. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కలాన్‌లోని 140 ఎకరాల భూమిని కూడా కాపాడినట్లు చెప్పారు. శేరిలింగంపల్లి మండలం కొండాపూర్‌లో రూ.3,600 కోట్ల విలువైన 36 ఎకరాల భూమిని కాపాడుకున్నామని సీఎం తెలిపారు. గండిపేట మండలం మంచిరేవులలోని ప్రభుత్వ భూముల విషయంలోనూ న్యాయపోరాటం చేశామని పేర్కొన్నారు. అక్కడ 50 ఎకరాలను యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ కోసం కేటాయించినట్లు వివరించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో రూ.400 కోట్ల విలువైన 106 ఎకరాల అటవీ భూమిని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 600 ఎకరాల అటవీ భూమిని న్యాయస్థానాల్లో పోరాడి కాపాడినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను సీఎం ఖండించారు. భూ ఆక్రమణలపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చినా బీఆర్ఎస్ నాయకులు స్పందించకపోవడంపై ప్రశ్నలు సంధించారు. పద్మాలయ స్టూడియో తదితర భూముల వ్యవహారాలను ప్రస్తావిస్తూ, గతంలో అధికారంలో ఉన్నప్పుడు వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీశారు. భూముల విక్రయం ద్వారా సమకూరే నిధులను ఎలా వినియోగించాలనే అంశంపై వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. మాజీ మంత్రి హరీశ్‌రావు మామ హనుమంతరావుకు సంబంధించిన భూముల సర్వేను అడ్డుకుంటున్నారంటూ కూడా సీఎం ఆరోపించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గబోమని, ప్రజా ఆస్తులను కాపాడి ప్రజల ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు.

భారత్‌లో హైఅలర్ట్!



అంతర్జాతీయ డెస్క్
భూటాన్‌లోని గాసా జిల్లాలో షింటాఫు హిమానీనద సరస్సు ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ పరిణామంతో భారత్‌లోని పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆయా రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. గురువారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనలో గాసా జిల్లాలో మోచు నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధ సహజ వేడినీటి బుగ్గ గాసా త్సాచు వద్ద సౌకర్యాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. అయితే ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. మోచు నది ఎగువ ప్రాంతంలో ఉన్న షింటాఫు సరస్సు భూటాన్‌లో ప్రమాదకరమైన హిమానీనద సరస్సుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. గతంలోనూ ఈ ప్రాంతంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. 2021 ఆగస్టు 26న మోచు నది ఉప్పొంగడంతో గాసా త్సాచు ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. తాజాగా పునాఖా జోంగ్‌కు సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని కబేసా గెవాగ్‌లో శ్రీగాంగ్ ప్రాంతాన్ని వరదనీరు దాటినట్లు సమాచారం. భూటాన్ సరిహద్దు ప్రాంతాల్లో వరద ముప్పు నేపథ్యంలో భారత్‌లోని పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలను కేంద్రం అప్రమత్తం చేసింది. అస్సాంలోని ధుబ్రి, పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలతోపాటు అలీపుర్‌దువార్, జల్‌పాయిగురి జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశ్చిమబెంగాల్‌లోని కూచ్‌బెహార్ జిల్లాలో సంకోష్ నది ఒడ్డున నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని హెచ్చరికలు జారీ చేశారు. వరద పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తూ, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు.

5న సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

రివార్డ్ బోనస్ (దీపావళి బోనస్) ను నవంబర్ 5వ తేదీన చెల్లించాల్సిందిగా సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. దీపావళి బోనస్ గా రూ.419 కోట్లను చెల్లించనున్నట్లు, ఒక్కో కార్మికుడికి గరిష్టంగా రూ.1,10,250 చొప్పున దీపావళి బోనస్ చెల్లించడం జరుగుతుందని వివరించారు. రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న సింగరేణి సంస్థ అభివృద్ధి విస్తరణకు ప్రజా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. లాభాల వాటా కింద ఈ నెలలో దాదాపు 600 కోట్ల రూపాయలు చెల్లించగా.. తాజాగా రూ.419 కోట్ల దీపావళి బోనస్ చెల్లించబోతున్నట్లు తెలిపారు. బొగ్గు రంగంలో పోటీని అధిగమించేందుకు బొగ్గు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అదేశాలపై సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సంబంధిత పర్సనల్ , ఫైనాన్సు అధికారులతో మాట్లాడి నవంబర్ 5వ తేదీన దీపావళి బోనస్ ను కార్మికుల బ్యాంకు ఖాతాల్లో చెల్లింపునకు తగిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
ఎన్ సీ డబ్ల్యు ఏ ఉద్యోగులకు వర్తిస్తుందని
దీపావళి బోనస్ కింద సగటున ఒక్కొక్క కార్మికుడికి 1,10,250 రూపాయలు అందనున్నాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో భూగర్భ గనుల విభాగంలో 190 పని దినాలు, ఓపెన్ కాస్ట్.సర్ఫేస్ విభాగాల్లో 240 పని దినాలు పూర్తి చేసిన కార్మికులకు పూర్తిస్థాయిలో బోనస్ అందుతుంది అంతకంటే తక్కువ హాజరు శాతం ఉన్నవారికి పని చేసిన కాలానికి నిష్పత్తి ప్రకారం బోనస్ ను లెక్క కట్టి చెల్లించడం జరుగుతుందన్నారు.అయితే ఈ బోనస్ పొందడానికి కనీస అర్హతగా గత ఆర్థిక సంవత్సరంలో ఏ కార్మికుడైనా కనీసం 30 రోజులు పని చేసి ఉండాలని నిర్ణయించారు. మొత్తం మీద చూస్తే సుమారు 38,000 మంది ఉద్యోగులకు ఈ బోనస్ వర్తించనుంది.
నెల రోజుల వ్యవధిలోనే దసరా ,దీపావళి బోనస్ ల రూపంలో సగటున దాదాపు 2,65,000 రూపాయలను కార్మికులు అందుకోబోతున్నారని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి సింగరేణి ఉద్యోగులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ కార్మికులు బోనస్ ల సొమ్మును తమ కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, అవకాశం ఉంటే పొదుపు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ పండుగల స్ఫూర్తితో ఉత్సాహంగా పనిచేయాలని గనుల వారీగా, శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని కోరారు.

ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

మొదటి తరువాయి

తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడంలో ఇది చారిత్రాత్మక విజయమని అభివర్ణించారు. ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల ఛైర్మన్లు సహా పలువురు ముఖ్య నాయకులు తరలివెళ్తున్నారని వెల్లడించారు. ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తోందన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనపై స్పందిస్తూ.. దేశ హోంమంత్రిగా ఆయన నగరానికి రావడంపై అభ్యంతరం లేదని, అయితే తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు ఉన్నాయని పొన్నం పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు, అమరవీరుల త్యాగాలపై గతంలో పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలకు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్, ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితులు, చైనా సరిహద్దు సమస్యలు వంటి కీలక అంశాలను పక్కనపెట్టి, ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాజకీయ లబ్ధి కోసం పర్యటిస్తున్నారని విమర్శించారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అధికారికంగా లేఖ రాస్తున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు. బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంతోపాటు రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే కులాల వారీగా జనాభా గణాంకాలు అవసరమని చెప్పారు. పశువులు, గొర్రెల లెక్కలు తీస్తున్న కేంద్ర ప్రభుత్వం కోట్లాది మంది బీసీల జనాభా లెక్కలను ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్‌లకు చిత్తశుద్ధి ఉంటే జాతీయ జనగణనలో కులగణనను చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు

విభేదాలొస్తే అత్యాచారం అనలేం!



న్యూఢిల్లీ:
పరస్పర సమ్మతితో కొనసాగిన బంధంలో విభేదాలు ఏర్పడినంత మాత్రాన, గతంలో ఉన్న సాన్నిహిత్యాన్ని అత్యాచారంగా పరిగణించలేమని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సంబంధాలు విఫలమైన తర్వాత వాటిని క్రిమినల్ కేసులుగా మార్చే ధోరణి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. అత్యాచారం, మోసం వంటి ఆరోపణల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. కేరళకు చెందిన ఓ వ్యక్తిపై నమోదైన అత్యాచారం, మోసం కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సంబంధం సజావుగా కొనసాగుతున్న సమయంలో పరస్పర అంగీకారంతో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని, ఆ బంధం విచ్ఛిన్నమైన తర్వాత మాత్రమే అత్యాచారంగా పరిగణించలేమని ధర్మాసనం పేర్కొన్నట్లు కథనం తెలిపింది. పరస్పర సమ్మతితో ఉన్న సంబంధాన్ని కేవలం విభేదాలు తలెత్తాయనే కారణంతో నేరంగా పరిగణించి, ఒక వ్యక్తి స్వేచ్ఛ, గౌరవానికి భంగం కలిగించే చర్యలు తీసుకోలేమని వ్యాఖ్యానించింది. అయితే, సమ్మతి లేకుండా జరిగిన లైంగిక చర్యలు లేదా మోసానికి సంబంధించిన ఆరోపణలను వాటి వాస్తవాల ఆధారంగా విడివిడిగా పరిశీలించాల్సి ఉంటుందని ఈ సందర్భంలో గుర్తించాలి. ఈ కేసులో బాధితురాలు తనకు ఇదివరకే వివాహమైన విషయాన్ని దాచిపెట్టి నిందితుడు రెండో వివాహం చేసుకున్నాడని ఆరోపించారు. ఆ విషయం తెలిసిన తర్వాత అతడి నుంచి విడిపోయినట్లు తెలిపారు. తనను మోసం చేసి రెండో పెళ్లి చేసుకున్నాడని పేర్కొంటూ అత్యాచారం, మోసం, నమ్మకద్రోహం ఆరోపణలతో ఫిర్యాదు చేశారు. ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం సంబంధాల వైఫల్యాన్ని, క్రిమినల్ నేరాలకు సంబంధించిన ఆరోపణలను ఒకే విధంగా చూడకూడదని అభిప్రాయపడింది

దేశం కష్టాల్లో ఉంటే విపక్షాలకు సంతోషం!

బనస్కాంత, గుజరాత్
దేశం అంతర్జాతీయ సంక్షోభాలను ఎదుర్కొంటున్న సమయంలో ప్రతిపక్షాలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా వ్యవహరిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా విమర్శించారు. ఇరాన్--అమెరికా మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎరువులు, గ్యాస్ కొరతపై వదంతులు వ్యాప్తి చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ప్రజలంతా కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ వర్గాలు మాత్రం దేశం ఇబ్బందుల్లో పడాలని కోరుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. సంక్షోభ పరిస్థితుల్లోనూ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని మండిపడ్డారు. గుజరాత్‌లోని బనస్కాంతలో నిర్వహించిన కార్యక్రమంలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధులను విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తుంటే, కొన్ని రాజకీయ పార్టీలు దేశ ప్రగతిపై అసంతృప్తితో ఉన్నాయని మోదీ విమర్శించారు. అంతర్జాతీయ పరిణామాల కారణంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పుడు ప్రజలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని పేర్కొన్నారు. అయితే ఎరువులు, వంటగ్యాస్ కొరత ఏర్పడుతుందంటూ వదంతులు వ్యాప్తి చేయడం ద్వారా ప్రజల్లో ఆందోళన కలిగించే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని మోదీని రాజకీయంగా ఇబ్బందుల్లోకి నెట్టాలనే ఉద్దేశంతోనే ఇలాంటి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని హితవు పలికారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరుగుతున్నప్పటికీ, ఆ భారాన్ని భారత రైతులపై పడనివ్వబోమని ప్రధాని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడి ఖర్చులకు కొంతమేర తోడ్పాటు అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత కింద దేశవ్యాప్తంగా సుమారు రూ.19 వేల కోట్ల నిధులను ప్రధాని విడుదల చేశారు

క్రైస్తవులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) అక్టోబర్ 30

సోమజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ రంగాల్లో అవకాశ కల్పన కోసం సమర్పిస్తున్న విజ్ఞాపత్రం తెలంగాణ క్రైస్తవ పాస్టర్లు నాయకులు క్రైస్తవ పెద్దలు విజ్ఞప్తి చేశారు కాంగ్రెస్ పార్టీకి క్రైస్తవ సమాజం చారిత్రాత్మక అనుబంధంతో పాటు సమాజానికి అందించిన సేవలు అమోఘమైన మని ఆయన అన్నారు ఐదు దశాబ్దాల ఎన్నికల రాజకీయ అనుబంధం ఉందని అవి భక్త ఆంధ్రప్రదేశ్ లో భాగంగా ఉన్న కాలం నాట్ నుంచి నేటి తెలంగాణ వరకు ఐదు దశాబ్దాలు పైగా క్రైస్తవ సమాజం లౌకికవాదం సమగ్రత సామాజిక న్యాయం వంటి సూత్రాలకు ప్రాధాన్యతను ఇచ్చే భారత జాతీయ కాంగ్రెస్ పార్టీతో రాజకీయంగా అనుబంధాన్ని కొనసాగిస్తూ తమ మద్దతు ఇచ్చిందని ఆయన చెప్పారు 20 23 కాంగ్రెస్ పార్టీలో అధికారం రావడం కోసం క్రైస్తవ సంఘాలు కృషిచేశారని ఆయన తెలిపారు సామాజిక మౌలిక సదుపాయాలు దేశ నిర్మాణంలో



భాగస్వామ్యం విద్యా క్రైస్తవ మిషనరీ సంస్థలు తెలంగాణ వ్యాప్తంగా అనేక పాఠశాలలు డిగ్రీ కళాశాలలో వృత్తిపరమైన విద్యా సంస్థలు సాంకేతిక శిక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్నాయని మిషన్ ఆసుపత్రులు గ్రామీణ వైద్య కేంద్రాలు ప్రజారోగ్య కార్యక్రమాల ద్వారా సేవలందిస్తూ కులమతం అనే భేదం లేకుండా లక్షలాదిమంది విద్యార్థులను నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని ఆయన తెలిపారు ప్రతి జిల్లాలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా క్రైస్తవ ముస్లింలు సమస్యవ కార్యక్రమాలు భాగస్వాములు అయి సేవలందిస్తున్నారని ఆయన వివరించారు సికింద్రాబాద్ మల్కాజిగిరి మేడ్చల్ మల్కాజిగిరి రంగారెడ్డి జిల్లాలో పేదలకు వైద్య సేవలు అందిస్తుందని తెలంగాణ నిజాంబాద్ మెదక్ కామారెడ్డి ఖమ్మం వరంగల్ జిల్లాలో దక్షిణ తెలంగాణ ఇతర ప్రాంతాలైన నల్గొండ మహబూబ్నగర్ కరీంనగర్ తెలంగాణలో 119 నియోజకవర్గాల్లో క్రైస్తవ సమాజం విశేషమైన ప్రాధాన్యత ఉందని కొన్ని అంచనాల ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 25 నుండి 30 శాసనసభ నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలు ప్రభావితం చేసే శక్తి క్రైస్తవ ఓట్లకు ఉందని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో జాతీయ ప్రెసిడెంట్ సి.ఆర్.ఐ.ఎల్ డాక్టర్ కే బాబురావు ఐపీఎస్ రిటైర్డ్ ఐపీఎస్, ప్రొఫెసర్ డాక్టర్ రెవరెండ్ రాజేశ్వర్ సలమోన్ రెవిడెన్స్ సంజయ్ కుమార్ తెలంగాణ బాప్తిస్ గుడ్ షెఫర్డ్ చర్చ్ గిరిబాబు యూత్ ప్రెసిడెంట్ మెటల్ రాజ్ బీమ్ రాముడు నాయుడు బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ బిషప్ బుక్ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించడమే లక్ష్యం

-సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించిన ఎస్ఐ శోభన్ బాబు



మునుగోడు, అక్టోబర్ 30 (వార్త సంధ్య):
పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, పోలీస్ ఫ్లాగ్ డే-- 2026 సందర్భంగా శుక్రవారం మునుగోడు మండల విద్యా వనరుల కేంద్రంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార దుర్వినియోగం, సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు.వ్యాసరచన పోటీల్లో సైబర్ నేరాల నివారణలో పౌరులు, పోలీసుల పాత్ర, మాదకద్రవ్యాల బెడద నివారణలో పోలీసుల బాధ్యత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన విధానం వంటి అంశాలపై తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ సందర్భంగా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎస్ఐ శోభన్ బాబు బహుమతులు అందజేసి అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సామాజిక స్పృహ, చట్టాల పట్ల అవగాహన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం, ప్రధానోపాధ్యాయులు కే. బాలప్రసాద్, కార్యక్రమ హోస్ట్ కుడతాల రత్నయ్య, గ్యార నర్సింహ, నలపరాజు వెంకన్న, గంగావతి, సదా లక్ష్మి, వెంకటేశ్వర్లు, చంద్రం, సుధాకర్ రెడ్డి, జాల నాగమణి, సత్తిరెడ్డి, నాగరాజు, సతీష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం విజయవంతం

హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)అక్టోబర్ 30.

హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా, బి ఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు, నాంపల్లి నియోజకవర్గ బి ఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ సిహెచ్ ఆనంద్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ అబ్దుల్లా సోయెల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడం, అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించడం, పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల కార్యాచరణను క్షేత్రస్థాయిలో అమలు చేయడంపై చర్చించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

లచ్చపేట మోడల్ పాఠశాలలో జాతీయ స్థాయి క్రీడాకారిణి జ్ఞానశ్రీకి అభినందన



దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 30:
దుబ్బాక మండలం లచ్చపేటలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలను డీఐఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పాఠశాల విద్యార్థిని, ప్రతిభావంత క్రీడాకారిణి జ్ఞానశ్రీని ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని ఈ సందర్భంగా డీఐఈఓ పేర్కొన్నారు. జ్ఞానశ్రీ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామలేటి బుచ్చిబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు (పీడీ) రవీందర్తో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొని జ్ఞానశ్రీని అభినందించారు.

రక్తదానం మరొకరి జీవితాన్ని కాపాడుతుంది ఎస్ డి పి ఓ వెంకన్న బాబు



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో 30, అక్టోబర్ (వార్త సంధ్య)
పోలీస్ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, రక్తదానం మరొకరికి జన్మనిచ్చినట్లేనని ఎస్డి పి ఓ వెంకన్న బాబు అన్నారు.పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఇల్లందు సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రాజస్థాన్ సేవా ట్రస్ట్ ఫంక్షన్ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగ డీఎస్పీ వెంకన్నబాబు మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సమాజ సేవలో భాగంగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ముఖ్యంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు తరచుగా రక్తం అవసరమవుతుందని, వారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ శిబిరంలో సేకరించిన రక్తాన్ని తలసేమియా బాధితుల అవసరాల కోసం సంకల్ప సేవా సమితికి అందజేయనున్నట్లు వెల్లడించారు.యువకులు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ అధికారులు అభినందించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలోసింగరేణి జనరల్ మేనేజర్ వీసం కృష్ణయ్య, సీఐలు సురేష్, సత్యనారాయణ, తిరుపతి, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువకులు, విద్యార్థులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల్లో భాగంగా మెగా రక్తదాన శిబిరం

-రక్తదానం ప్రాణదానంతో సమానం

-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 30 అక్టోబర్ (వార్త సంధ్య)
పోలీస్ అమరవీరుల సంస్మరణోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ, పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలతో పాటు అన్ని సబ్ డివిజన్ల పరిధిలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు, అత్యవసర సమయాల్లో రక్తం ఎంతమందికి ప్రాణదానం చేయగలదనే విషయాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం సమాజానికి అందించే గొప్ప సేవ అని పేర్కొన్నారు.ఈ మెగా రక్తదాన శిబిరంలో విద్యార్థులు, యువకులు, మహిళలు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు తదితరులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం వారికి పండ్లు, పండ్ల రసాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎంహెచ్ఓ తుకారం నాయక్, కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, శ్రీలక్ష్మి, జితేందర్, యాసిన్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, నరేష్, ఆర్ఐలు రవి, లాల్‌బాబు, కృష్ణారావు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

-ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే జారే



ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో 30, అక్టోబర్ (వార్త సంధ్య)
ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి విన్నత శిఖరాలకు అధిరోహించేలా విద్యార్థులకు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం దమ్మపేట మండలం సరోజినాపురం గ్రామంలో ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆకస్మికంగ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువులో ప్రతిభను తెలుసుకునేందుకు స్వయంగా వారితో మాట్లాడి బోర్డుపై పదాలు రాయించి పుస్తకాల్లోని పాఠాలను చదివించి ఉపాధ్యాయులుగ మారారు.విద్యార్థులు చక్కగ చదువుతూ మంచి ప్రతిభ కనబరచడంతో వారిని అభినందించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి ప్రతిభను వెలికితీస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే విధంగా నిరంతరం విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.

విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

-ఎమ్మెల్యే జారె ఆదినారాయణ



ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో,30 అక్టోబర్ (వార్త సంధ్య)
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పట్వారిగూడెంలో చిన్నారులను చదువుపై ఆసక్తి కలిగించేలా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ తరగతి గదిని శుక్రవారం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల వయసుకు తగిన విధంగా విద్యను సులభంగా అర్థం చేసుకునేలా వివిధ రకాల ఆట వస్తువులు ఆకర్షణీయమైన బోధనా సామగ్రిని ఏర్పాటు చేశారు.ఆటపాటల ద్వారా విద్యను నేర్చుకునే విధానం చిన్నారుల్లో చదువుపై ఆసక్తిని పెంచడంతో పాటు వారి ఆలోచనా శక్తి సృజనాత్మకతను అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని తెలిపారు గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఇలాంటి ఏర్పాట్లు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే చదువుపై మక్కువ పెంచుకుని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూరం అర్జున్ రావు , మండల విద్యాశాఖ అధికారి జగపతి రావు, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ, ఉపసర్పంచ్ బొల్లికొండ నాగేశ్వరరావు గారు, వాసం శ్రీనివాసరావు, గ్రామకమిటీ అధ్యక్షులు రెడ్డిమల్ల వెంకటేశ్వరరావు గారు, కోటగిరి యుగేంద్ర రావు, చెలికాని ప్రసాద్, వాసం వేణు గారు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల రక్షణలో పోలీసుల సేవలు మరువలేనివి

-రక్తదానం చేసిన బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ నాయకులు ఖాజా భక్ష్



ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 30, అక్టోబర్ (వార్త సంధ్య)
పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం క్లబ్ లొ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి బీఆర్ఎస్ పార్టీ ముస్లిం మైనారిటీ పట్టణ నాయకులు, ముస్లిం హక్కుల పోరాట సమితి సిటీ ప్రెసిడెంట్ ఖాజా భక్ష్ హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారికి డీఎస్పీ ఆదినారాయణ, సీఐలు యాసీన్, శ్రీలక్ష్మి, జితేందర్, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఖాజా భక్ష్ మాట్లాడుతూ. రక్తదానం ద్వారా ప్రాణాపాయంలో ఉన్న వారిని రక్షించవచ్చని చెప్పారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. శాంతిభద్రతల రక్షణలో పోలీసుల సేవలు మరువ లేనివని కొనియాడారు.

ప్రతి గ్రామానికి ఒక లైబ్రరీ -
- యువత చేతిలో పుస్తకం

ఆరేపల్లిలో లైబ్రరీ ఏర్పాటుకు గది పరిశీలించిన అఖిల రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు



దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 30:
గ్రామీణ ప్రాంత యువతకు విద్య, విజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని అఖిల రాజ్ ఫౌండేషన్ ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా దుబ్బాక మండలం ఆరేపల్లి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు కోసం అనువైన గదిని అఖిల రాజ్ ఫౌండేషన్ జిల్లా ఇన్‌చార్జి కీసరి స్వామి పరిశీలించారు. స్థానిక సర్పంచ్ శ్రీనివాస్‌తో కలిసి గదిని పరిశీలించిన కీసరి స్వామి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతకు పుస్తకాలు అందుబాటులో ఉండేలా లైబ్రరీలను ఏర్పాటు చేయడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు లైబ్రరీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసి యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు వారి భవిష్యత్తుకు విద్యను బలమైన పునాదిగా నిలపాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక మండల అధ్యక్షుడు పాకనాటి సునీల్ కుమార్, ఉపాధ్యక్షుడు గుంటి రాహుల్, వడిచర్ల వెంకటేష్, రాష్ట్ర కోఆర్డినేటర్ ఇనుప రవి తదితరులు పాల్గొన్నారు. “గ్రామీణ యువత భవిష్యత్తుకు పుస్తకమే పునాది” అనే నినాదంతో ప్రతి గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు దిశగా అఖిల రాజ్ ఫౌండేషన్ అడుగులు వేస్తోంది.

ఢిల్లీ నిరసన కార్యక్రమానికి
సిద్ధిపేట కాంగ్రెస్ శ్రేణులు



సిద్ధిపేట ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 30
కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షురాలు తూంకుంట అంక్ష రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న “మన ఓటు పరిరక్షణకై ఒక్కటిగా గొంతెత్తుదాం” నిరసన కార్యక్రమానికి సిద్ధిపేట జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. ఓటు హక్కు పరిరక్షణకు సంఘటితంగా తమ గళాన్ని వినిపించేందుకు ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
అన్ని రంగాల్లో రాణించాలి

చీకోడ్ గ్రామ సర్పంచ్ కొమిరె నరేష్





దుబ్బాక ప్రతినిధి (వార్తసంధ్య)అక్టోబర్ 30
సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామం లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని చీకోడ్ గ్రామ సర్పంచ్ కొమిరె నరేష్ అన్నారు. శుక్రవారం చీకోడ్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, పాఠ్యపుస్తకాలు, బూట్లు తదితర సౌకర్యాలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం
అందించడంలో నిర్లక్ష్యం సహించేది లేదు





ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 30,అక్టోబర్ (వార్త సంధ్య)
విద్యార్థులకు నాణ్యమైన విద్య పౌష్టిక ఆహారంలో నిర్లక్ష్యం వహిస్తే రక్షించేది లేదని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
గుండాల ఏకలవ్య పాఠశాలలో లోపాలపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి.. ప్రిన్సిపాల్‌కు మెమో, వంట మనిషిని తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి.మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. భూ రీ సర్వే పనులు వేగవంతం చేయాలని రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి భూ రీ సర్వే పనులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.గుండాల రెవెన్యూ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ సర్వే పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 10,390 ఎకరాల విస్తీర్ణంలో 6,694 ఎకరాలు అటవీ భూములుగా ఉన్నాయని, అటవీ శాఖ గెజిట్ ప్రకారం నిర్దేశించిన హద్దులు, ఎన్‌క్లోజర్ లేయర్ల ఆధారంగా మిగిలిన భూముల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 950 ఎకరాల్లో సర్వే పూర్తికాగా, అందులో 561 ఎకరాల ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించినట్లు సిబ్బంది వివరించారు.
రైతుల సమక్షంలోనే భూముల హద్దులను నిర్ధారించాలని, వారి పేర్లు, సంతకాలు, ఆధార్, మొబైల్ వివరాలను ఫీల్డ్ రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. పహాణీ, పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలతో పాటు ప్రస్తుతం సాగు చేస్తున్న రైతుల వివరాలను కూడా నమోదు చేయాలన్నారు. అటవీ, అసైన్డ్, రెవెన్యూ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, రైతుల అభ్యంతరాలను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన అనంతరం హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, భూ రీ సర్వే ప్రక్రియను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డిజీపీఎస్ పరికరాల పనితీరును కూడా పరిశీలించారు.అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు అక్కడ అందిస్తున్న వైద్య సేవలు, రక్త పరీక్షలు, మందుల నిల్వలు, వైద్య పరికరాల లభ్యతపై వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మందుల గదిని పరిశీలించగా అత్యవసర వైద్య అవసరాలకు ఉపయోగించే సిరంజీలు అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించి కారణాలను ప్రశ్నించారు. ఇంటర్నెట్ సమస్యల కారణంగా మందులు, వైద్య సామగ్రి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికే ఇండెంట్ పెట్టామని వైద్యాధికారులు వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిరంజీలు, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.అనంతరం సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం, మందులు, భోజన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంత ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.అనంతరం గుండాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, భోజన సదుపాయాలను పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థులు లేకపోవడాన్ని గమనించి, తరగతుల సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని, సాంస్కృతిక కార్యక్రమాలను సెలవు రోజుల్లో నిర్వహించుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.పాఠశాల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వంటశాల, స్టోర్ రూమ్‌ను పరిశీలించగా బంగాళాదుంపలు కుళ్లిపోయి ఉండటం, పంచదారలో చీమలు పట్టి ఉండటాన్ని గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వంట మనిషిని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ సాంబార్, రసం పలుచగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరోజు ప్రభుత్వ మెనూ ప్రకారం బిర్యానీ వడ్డించాల్సి ఉండగా, అందుకు అనుగుణంగా భోజనం సిద్ధం చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు.పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన, పారిశుద్ధ్యం, భోజన నాణ్యత, ఆహార పదార్థాల నిల్వలో గుర్తించిన లోపాలపై ప్రిన్సిపాల్‌కు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన వసతులు, పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆయన వెంట సర్పంచ్ రాధా, తహసీల్దార్ సంగీత, ఎంపీడీవో బాలరాజు, ఎంఈఓ పార్వతి, ఎంపీవో త్రిలోక్, సర్వేయర్ శివకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ
అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి





ఉమ్మడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో, 30 అక్టోబర్ (వార్త సంధ్య)
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నార
గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.
రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం ఆర్ అండ్ ఆర్ పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.భద్రాచలం బ్రిడ్జిట్ నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.గోదావరి పుష్కరాల నాటికి ఆలయం, ఘాట్లు, పట్టణ పరిసర ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేసేలా శాఖల వారీగా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలు, అధికారులకు అప్పగించిన బాధ్యతలు, పనుల పురోగతికి సంబంధించిన మినిట్స్‌ను తప్పనిసరిగా నమోదు చేయాలని, తదుపరి సమీక్షలో వాటి ఆధారంగా పురోగతిని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. పనుల అమలులో ఎదురయ్యే సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సీపీఓ సునీత, జిల్లా పంచాయతీ అధికారి అనూష, భద్రాచలం దేవస్థానం ఈఓ దామోదర్ రావు, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, భద్రాచలం తహసీల్దార్ రామ్ కుమార్, దుమ్ముగూడెం తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారులు, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

సంపాదకీయం


నెతన్యాహు నెగ్గితే భద్రత ఎవరికి?



అక్టోబర్ 27న ఇజ్రాయెల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రధాన కేంద్ర బిందువుగా మారారు. ఇజ్రాయెల్ ఏర్పడిన 78 సంవత్సరాల చరిత్రలో దాదాపు రెండు దశాబ్దాల పాటు అధికారంలో కొనసాగిన నెతన్యాహుకు ఈ ఎన్నికలు అతిపెద్ద పరీక్షగా నిలిచాయి. 2021లో అధికారం కోల్పోయినప్పటికీ, 2022లో విజయం సాధించి తీవ్ర భావజాలం వైపు మొగ్గు చూపారు. అల్ట్రా ఆర్థడాక్స్ పార్టీల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై సుప్రీంకోర్టు నియంత్రణ తగ్గించగలిగారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి చేయగా, గాజాలో నెతన్యాహు నాయకత్వంలో భీకర సమరం సాగింది. ఇదో మారణహోమం అన్న తీవ్ర విమర్శలు వచ్చాయి. మరోవైపు ప్రతిపక్ష పార్టీలు అక్టోబర్ 7న హమాస్ దాడి ఇజ్రాయెల్ భద్రతా వైఫల్యమేనని, దీనికి నెతన్యాహును బాధ్యుడిగా నిలబెడతామని, నిరంతరం సాగుతున్న యుద్ధాలకు ముగింపు పలుకుతామని వెల్లడించాయి. ఈ ఎన్నికలు నెతన్యాహును అధికారం లోంచి తొలగించడానికి విపక్షాలకు ఒక అవకాశంగా మారాయి. అయితే ఈ ఎన్నికల ఫలితాలు మిశ్రమ సంకేతాలను అందించాయి. బుధవారం సాయంత్రం పోలైన ఓట్లలో 86 శాతం లెక్కించగా 120 స్థానాలున్న ఇజ్రాయెల్ పార్లమెంట్ (క్నెసెట్)లో నెతన్యాహు నేతృత్వం లోని లికుడ్ కూటమికి 54 సీట్లు, ప్రత్యర్థి ఐజెన్‌కాట్ నేతృత్వం లోని కూటమికి 47 సీట్లు వచ్చే అవకాశం కనిపించింది. అరబ్ పార్టీలు కూడా 19 సీట్ల వరకు సాధించే అవకాశం ఉంది.ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలిపి 67 స్థానాలను సాధించే దిశగా ఉన్నప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అంత సులభం కాదు. ఎందుకంటే అరబ్ పార్టీల మద్దతును స్వీకరించడానికి కొన్ని యూదు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రభుత్వం ఏర్పాటుకు సంబంధించిన కూటమి చర్చలను విశాల దృక్పథంతో, ముందస్తు అభిప్రాయాలు లేకుండా జరపాలని ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ విజ్ఞప్తి చేసినా రాజకీయ పార్టీల మధ్య నమ్మకం లోపించింది. చివరి ఫలితాల తరువాత సీట్ల పంపకం కొనసాగితే స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు రానున్న కొన్ని రోజుల వరకు పార్టీల మధ్య తీవ్ర చర్చలు, సంప్రదింపులు, ఒప్పందాల ప్రయత్నాలు జరుగుతాయి. అంతవరకు ప్రస్తుత ప్రధాన మంత్రి నెతన్యాహుయే తాత్కాలిక ప్రధాన మంత్రిగా కొనసాగుతారు. ఈ పరిస్థితి ఆయనకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఎన్నికలు ప్రధానంగా నెతన్యాహుపై ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ఒక రిఫరెండమ్ లాంటిది.ఒకప్పుడు ఇజ్రాయెల్‌లో బలమైన వామపక్ష ఉద్యమం ఉండేది. కానీ నేడు అక్కడి రాజకీయాలు ప్రధానంగా మతపరమైన జియోనిజం, దాని వివిధ రూపాల ఆధిపత్యంలో ఉన్నాయి. నెతన్యాహును వ్యతిరేకించే కూటమి కూడా అరబ్ రాజకీయ పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయబోమని హామీ ఇవ్వడం గమనార్హం. నెతన్యాహు తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా వేసే ఓటును ఇజ్రాయెల్ శత్రువులకు మద్దతుగా చిత్రీకరించడం ద్వారా ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పడేశారు. ఇజ్రాయెల్‌ను రక్షించడానికి తన యుద్ధాలు ధైర్యవంతమైన, తప్పనిసరి చర్యలని నెతన్యాహు చెప్పుకొచ్చారు. ఇజ్రాయెల్ భద్రతపై ప్రజల్లో ఉన్న ఆందోళనలను తన రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. ఇజ్రాయెల్ జనాభాలో దాదాపు 20 శాతంగా ఉన్న అరబ్ ప్రజలు అరబ్ రాజకీయ పార్టీల వెనుక ఏకమవ్వడం ఈ విభజనను ప్రతిబింబిస్తోంది. ఇజ్రాయెల్ యూదులు, అరబ్ పౌరుల మధ్య రాజకీయ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌లో రాజకీయ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయన్న వాస్తవాన్ని ఈ ఎన్నికలు స్పష్టం చేస్తున్నాయి. బెంజమిన్ నెతన్యాహు అధికారంలో కొనసాగుతున్నంత కాలం ఇరాన్‌పై యుద్ధమే కాదు, ఇజ్రాయెల్‌కే కాకుండా మొత్తం మధ్య ప్రాచ్య ప్రాంతానికే నష్టం కలగక తప్పదు. ట్రంప్ కూడా నెతన్యాహుకు మద్దతు తెలుపుతూ ఇరాన్‌పై మొదలు పెట్టిన సైనిక చర్యను చివరివరకు కొనసాగించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ తన సవాళ్లను అధిగమించి తన రాజకీయ స్థితిని నిలబెట్టుకుంటే పశ్చిమాసియా మరోసారి భగ్గుమనక తప్పదు. అయినాసరే ప్రభుత్వ పాలనలో అరబ్ పార్టీల భాగస్వామ్యాన్ని అన్ని వర్గాలు విస్తృతంగా ఆమోదించినప్పుడే నెతన్యాహు ప్రభుత్వానికి స్వస్తి పలకడం జరుగుతుంది.అరబ్ పార్టీలు కీలకంగా మారితే వాటితో కలిసి పనిచేయడానికి నెతన్యాహు వ్యతిరేక కూటమి అంగీకరిస్తుందా అనేది అసలు ప్రశ్న ఈ ఎన్నికల ఫలితాల నుంచి ప్రతిపక్ష పార్టీలు పాఠం నేర్చుకుని అరబ్ పార్టీలతో కలిసి విస్తృత కూటమిని ఏర్పాటు చేయాలి. ప్రభుత్వం జవాబుదారీతనంతో పనిచేసేలా చూడాలి. నెతన్యాహు నియంత్రణ లోని సైనిక చర్యలను తిరిగి పరిశీలించాలి. అలాగే ప్రపంచ దేశాలతో ఇజ్రాయెల్ సంబంధాలను తిరిగి మెరుగపరిచే ప్రయత్నాలు సాగించాలి. ఇదే సమయంలో మధ్యప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులు కూడా మారుతున్నాయి. సోమవారం టెహ్రాన్‌లో ఇరాన్ నాయకులు, సౌదీ అరేబియా, టర్కీ, పాకిస్థాన్‌లకు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధులతో సమావేశం జరిగింది. ఇజ్రాయెల్, అమెరికా కారణంగా తాము ఎదుర్కొంటున్న సంఘర్షణలకు దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలనే వారి ప్రయత్నం కనిపించింది. తమ మధ్య విభేదాలు ఉన్నప్పటికీ, చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. ఈ పరిణామాలు ఇజ్రాయెల్ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో పరిశీలించాల్సిందే.

ఓటు హక్కుకోసం పోరాటం

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల భవిష్యత్తును నిర్ణయించేది ప్రజలే. ఆ నిర్ణయానికి ప్రాతిపదిక ఓటు హక్కు. కానీ ఓటు వేయాలనే ఆసక్తి ఉన్నా, ఓటర్ల జాబితాలో పేరే లేకపోతే పౌరుడి గొంతుకకు విలువ ఉండదు. ఓటు హక్కు కల్పించడంతో పాటు, దాన్ని వినియోగించుకునే అవకాశం ప్రతి అర్హుడికీ ఉందని నిర్ధారించడం కూడా ఎన్నికల వ్యవస్థ బాధ్యత. ఇప్పుడు దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై తలెత్తుతున్న వివాదాల నేపథ్యంలో ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో నవంబర్ 1న న్యూఢిల్లీలో 'ఓట్ బచావో-దేశ్ బచావో' ర్యాలీ నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాలను ఎప్పటికప్పుడు సరిచేయడం అవసరమే. మరణించినవారి పేర్లు కొనసాగకుండా చూడటం, నకిలీ ఓట్ల నమోదులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను తొలగించడం ఎన్నికల సంఘం విధుల్లో భాగం.అయితే ఈ క్రమంలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. సవరణ ప్రక్రియలో తప్పులు జరిగితే వాటి ప్రభావం కేవలం ఒక వ్యక్తిపైనే కాదు. ఎన్నికల్లో ప్రజల భాగస్వామ్యంపైనా పడుతుంది. అందువల్ల ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్ని పేర్లు తొలగించారన్న లెక్కతో కాకుండా, అనర్హుల పేర్లను సరిగా గుర్తించడంతోపాటు అర్హులందరి ఓటు హక్కును ఎంత సమర్థంగా కాపాడారన్న ప్రమాణంతో అంచనా వేయాలి. దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన గణాంకాల ప్రకారం, వివిధ దశల్లో ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి సుమారు 13.37 కోట్ల పేర్లు తొలగించబడ్డాయి. పెద్ద సంఖ్యలో పేర్లు తొలగించినప్పుడు ప్రతి కేసునూ ఎలా పరిశీలించారు? ఓటరు అందుబాటులో లేకపోతే మరోసారి సంప్రదించారా? అభ్యంతరాలు తెలిపేందుకు తగిన సమయం ఇచ్చారా? పేర్లు తొలగించిన కారణాలను వ్యక్తిగతంగా తెలియజేశారా?అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. గణాంకాలు వెల్లడించడం మాత్రమే కాకుండా, వాటి వెనుక ఉన్న ప్రక్రియను కూడా ఎన్నికల సంఘం ప్రజలకు వివరిస్తేనే ప్రజలకు భరోసా కలుగుతుంది. అయితే దురదృష్టవశాత్తు సర్ ప్రక్రియలో పారదర్శకతో లోపిస్తుంది. మరోవైపు 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలనే నిబంధనతో ప్రజల్లో అనుమానాలు రెట్టింపవుతున్నాయి. తెలంగాణలో ఓటర్ల జాబితాల సవరణపై పలు సందేహాలున్నాయి. రాష్ట్రంలో గతంలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, 2,64,87,213 మంది నుంచి గణన పత్రాలు అందినట్లు ఎన్నికల సంఘం పేర్కొనడంతో 73,39,235 మంది పేర్లు ముసాయిదా జాబితాలో లేకుండా పోయినట్లు లెక్కలు



సూచిస్తున్నాయి.మరోవైపు సుమారు 92,87,577 మందికి అనుమానాస్పదం కింద నోటీసులు జారీ చేశారు. వీరందరి కోసం తెలంగాణ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో బిఎల్ఎలను నియమించి వారి ఓటు హక్కును పరిరక్షించేందుకు కృషి చేసింది. దేశ వ్యాప్తంగా తొలగించిన ఓట్ల గణాంకాలను పరిశీలిస్తే కీలకమైన అంశాలు వెలుగుచూస్తున్నాయి .గత జాబితాతో వివరాలు సరిపోలకపోవడం ప్రస్తుత ఓటరు అర్హత లేదని నిర్ధారించడానికి సరిపోతుందా? దశాబ్దాలుగా ఓటు వేస్తున్న వ్యక్తి పూర్వీకుల వివరాలు లేదా పాత చిరునామాను సమర్పించలేకపోతే అతడి హక్కు ప్రశ్నార్థకమవ్వాలా? సందేహాలపై ఎన్నికల సంఘం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదు. చిరునామా మారినవారు, తాత్కాలికంగా అందుబాటులో లేనివారు, పత్రాలు సేకరించలేని వృద్ధులు, పేదలు ఎదుర్కొనే ఇబ్బందులను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్ (ఎఫ్ఆర్సి)ను ప్రత్యామ్నాయ ఆధారంగా పరిగణించాలని కోరినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. గతంలో ఓటు వేసిన వారి పేర్లు కూడా తొలగించారు. ఇప్పుడు వారు ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం వివరాలు సమర్పించాల్సి రావడం ఎంత వరకు సమంజసం.ఓటర్ల నమోదు, తొలగింపు ప్రక్రియలో ఉపయోగించే ఫారం-6, ఫారం-7, ఫారం-8ల విషయంలోనూ స్పష్టత కరువైంది. కొత్త ఓటరు నమోదుకు ఫారం- 6, పేరు తొలగింపుకు సంబంధించిన అభ్యర్థనకు ఫారం-7, వివరాల సవరణలకు ఫారం-8 ఉపయోగిస్తారు. వీటిలో డిక్లరేషన్‌కు సంబంధించిన మార్పులు, వాటి చట్టపరమైన ఆధారాలు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో చోటుచేసుకున్న మార్పులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా ఫారం-6లో డిక్లరేషన్‌కు సంబంధించి నిబంధనలకు వ్యతిరేకంగా మార్పులు చేశారనే అంశంపై పెద్ద దుమారమే రేగింది. ఫారం-6లో మార్పుకు తాము అనుమతివ్వలేదని ఇప్పటికే ఉన్నత న్యాయస్థానం కూడా వ్యాఖ్యానించింది. ఫారం-7 ద్వారా ఓట్ల తొలగింపులో కూడా అక్రమాలు జరుగుతున్నాయనే కాంగ్రెస్ ఆరోపణలు తెలంగాణలో నిరూపితమైంది
హైదరాబాద్‌లో బిజెపికి చెందిన బిఎల్ఎ ఫారం-7 ద్వారా వారి వ్యతిరేక ఓట్ల తొలగింపుకు ప్రయత్నిస్తున్నప్పుడు కేసు నమోదైంది. దేశంలో ఓటు చోరీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ రుజువులతో సహా నిరూపించారు. అదే తరహాలో ఇప్పుడు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌తో మరో ఇద్దరు కమిషనర్లు పలు అంశాలపై విభేదించడంతో ఎన్నికల సంఘంలో అవకతవకలపై అనుమానాలు రెట్టింపవడమే కాకుండా దీర్ఘకాలికంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు నిజమని తేలాయి. ప్రజాస్వామ్యానికి కీలకమైన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తుండడంతో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, సీనియర్ నేత ప్రియాంక గాంధీ నేతృత్వంలో పార్టీ చేపట్టిన నిరసనలకు ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నుండి భారీ స్పందన రావడంతో బిజెపి ప్రభుత్వం అణిచేయాలని ప్రయత్నిస్తుంది. స్వయం ప్రతిపత్తిగల ఎన్నికల సంఘాన్ని మోడీ ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా భ్రష్టుపట్టిస్తోంది. డిసెంబర్ 2023లో ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలో బిజెపి ప్రభుత్వం మార్పులు చేస్తూ నియామక కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, ఆయన స్థానంలో కేంద్ర కేబినెట్ మంత్రికి చోటు కల్పించింది. అనంతరం 2024లో జ్ఞానేశ్ కుమార్‌ను సిఇసిగా నియమించి సర్‌తో సహా పలు వివాదాస్పద నిర్ణయాలకు ఆజ్యం పోసింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘాన్ని సంస్కరించాలని, సిఇసి తక్షణమే రాజీనామా చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లతో నవంబర్ 1న ఢిల్లీలో 'ఓట్ బచావో -దేశ్ బచావో' ర్యాలీ నిర్వహించేందుకు పిలుపిచ్చింది. ఈ పోరాటంలో ఇతర పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన, కార్మిక, రైతు సంఘాలు కూడా భాగస్వామ్యం అయితే మోడీ ప్రభుత్వం మెడ వంచక తప్పదు.

ఏ చేను చూసినా ఏమున్నది ఆశ!

వర్షాకాలం ఆరంభమైన నాటి నుంచి మా అందోల్ నియోజకవర్గంలోని దాదాపు అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటించాను. కరువు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతన్న కష్టాలను చూశాను, ఆవేదనను విన్నాను. పుల్కల్ , చౌటకూర్, ఆందోల్, టేక్మాల్ మండలాల్లో వరి పంటనే ఎక్కువగా సాగు చేస్తుంటారు. అల్లాదుర్గం, వటపల్లి మండలాల్లో అక్కడక్కడ వరి వేస్తే మిగతా గ్రామాల్లో పత్తి వేస్తారు. ఇక రైకోడ్, మునిపల్లి మండలాల్లో 90 శాతం పత్తి పంటనే సాగు చేస్తారు. పత్తి, వరి, కంది పంటలతో పాటు కూరగాయలు సాగు చేసిన రైతుల పొలాల గట్ల వెంబడి నడుస్తూ వారి గోడును విన్నాను. ఎల్-నినో ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు హెచ్చరించినా ప్రభుత్వం కనీస ముందస్తు ప్రణాళికలు గానీ, ప్రత్యామ్నాయ చర్యలు గానీ చేపట్టలేదు. పాలకుల ఈ ఘోర నిర్లక్ష్యం అన్నదాతల పాలిట శాపంగా మారింది. ప్రకృతి కన్నెర్రజేస్తే ఆదుకోవాల్సిన బాధ్యతాయుతమైన ప్రభుత్వం, తన కర్తవ్యం నుంచి పూర్తిగా తప్పుకొన్నది. మూడు నెలల నా పర్యటనలో, రైతులతో జరిపిన ప్రతి సంభాషణలోనూ వారి ఆవేదన, ఆక్రందన, ఆగ్రహం స్పష్టంగా కనిపించాయి. వ్యవసాయ సంక్షోభం అంటే అది కేవలం రైతులకు పరిమితమైన సమస్య కాదు. ఇది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై దుష్ప్రభావాన్ని చూపుతుంది. పాలకుల దూరదృష్టి లేని విధానాలు, అస్తవ్యస్తమైన ప్రణాళికలు, బాధ్యతారాహిత్య వైఖరిపై రైతులు కష్టాల్లో పడ్డారు. రాష్ట్రంలో ఏ రైతును కదిలించినా తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. మా ఆశను ప్రభుత్వమే చంపేసింది అని అన్నదాత కృష్ణయ్య గద్గద స్వరంతో చెప్తుంటే కన్నీళ్లు ఆగలేదు. పాలకుల నిర్లక్ష్యానికి, కరెంటు సరఫరా వైఫల్యానికి ఫలితంగా ఆ రైతుకు ఏకంగా రూ.15 లక్షల భారీ పంట నష్టం వాటిల్లింది. 'రోజుకు పది సార్లు కరెంటు పోతుంది సార్. వచ్చిన కొంచెం సేపు కూడా లో-వోల్టేజ్‌తో మోటర్లు నడువవు. బోర్లు ఎండిపోతున్నయి, నిలబడ్డ పంట మాడిపోతున్నదని మరో రైతు ఆవేదన చెందాడు. టెక్మాల్ మండలం కుసంగి, దన్నారం గ్రామాల మీదుగా వెళ్తుంటే దారిలో మానెమ్మ అనే మహిళ, డిగ్రీ పూర్తి చేసిన ఆమె కుమారుడు కరుణాకర్ కనిపిస్తే వారితో మాట్లాడాను. రెండెకరాల పొలాన్ని కాపాడుకోవడానికి లక్ష రూపాయల అప్పు చేసి 700 మీటర్ల దూరం నుంచి పైపులు వేస్తున్నారు. సంక్షోభంలోనూ పంటను బతికించుకోవాలనే వారి ఆశ నన్ను కదిలించింది. బిడ్డల్లాంటి పైరును ఎండబెట్టుకుంటే ఎట్లా బతకాలి? అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పొలం గట్టున దిగులుగా నిలబడ్డ బాలయ్య అనే రైతుతో మాట్లాడాను. పంట పొట్ట దశ దాటి గింజ కట్టిన సమయంలో ఇంకొక్క తడి అంది ఉంటే, అది పూర్తిస్థాయిలో మేలైన దిగుబడిని ఇచ్చేది. కానీ చివరి దశలో చుక్క నీరు అందక, గింజలో బలం లేక పైరంతా నేలకొరిగిపోయింది. యువ రైతు దుర్గయ్య పరిస్థితి చూస్తే గుండె బరువెక్కుతుంది. అతనికి ఉన్న సొంత ఐదెకరాల పంట పూర్తిగా ఎండిపోయింది. కౌలుకు తీసుకున్న ఐదెకరాలు కూడా మాడిపోయింది. కరువు విళయం, సర్కార్ నిర్లక్ష్యంతో ఎందరో రైతులు ఎన్నో ఆశలతో వేసిన



వరి చేలను పశువుల గ్రాసం కోసం కోసేశారు. మరికొందరైతే కోత కోయించడానికి కూడా చేతిలో పైసల్లేక, పశువులనే చేలలోకి తోలి మేపుతున్నారు. అలా పశువులను మేపుతున్న ఒక రైతును పలుకరిస్తే విస్తుపోయే నిజాన్ని చెప్పారు. కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైందని వాపోయారు. అన్నదాతల బాధ ఇట్లా ఉంటే పాలక పెద్దలకు చీమ కుట్టినట్టయినా లేకపోవడం సిగ్గుచేటు. వరి రైతుల పరిస్థితి ఇలా ఉంటే, పత్తి రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. మార్గమధ్యలో ఒక పత్తి చేనులోకి వెళ్లి పరిశీలిస్తే ఆందోళనకరమైన వాస్తవాలు కనిపించాయి. సరిపడా నీటివసతి, అనుకూల వాతావరణం ఉంటే ఒక్కో పత్తి చెట్టుకు దాదాపు 60 కాయల వరకు కాస్తాయి. కానీ ఈ వర్షాభావ పరిస్థితుల్లో అక్కడ చెట్టుకు కనీసం 20 కాయలు కూడా లేవు. గతంలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేది. కానీ ఇప్పుడు దుర్భిక్ష పరిస్థితుల్లో ఎకరాకు కేవలం 2 నుంచి 3 క్వింటాళ్లు వస్తే అదే గొప్ప అన్నట్టు ఉన్నది పరిస్థితి. ఎకరాకు వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, పురుగుల మందులు కొట్టి అప్పులపాలైన పత్తి రైతులకు కనీసం పెట్టిన పెట్టుబడిలో నాలుగో వంతు కూడా తిరిగి రాని దారుణ పరిస్థితి నెలకొన్నది.
మా నియోజకవర్గంలోని సింగూర్ , పోచారం, ముద్దాయిపేట, పుల్కల్, మింపూర్, కోడూరు, ఐసోజిపేట, గొంగళూర్, ఇసాజిపేట, చక్రియల్, శివంపేట్, వెండికోల్, లింగంపల్లి, కోరిపోల్ నుంచి కోరంపల్లి గ్రామం పక్కనే మంజీరా నది ప్రవహిస్తుంది. గతంలో కేసీఆర్ హయాంలో రైతుల కోసం ఈ నదిపై చెక్ డ్యామ్ నిర్మించారు. ఏటా ఈ చెక్‌డ్యామ్‌లో నీళ్లు నిండుగా కళకళలాడుతూ ఉండేవి. కానీ నేడు చూస్తే ఆ చెక్ డ్యామ్ చుక్క నీరు లేక పూర్తిగా ఎండిపోయి, నెర్రలు వారి దర్శనమిస్తున్నది. ఈ దారుణ దుస్థితికి అసలు కారణం పాలకుల అనాలోచిత వైఖరే. సింగూరు ప్రాజెక్టులో ఏకంగా 22 టీఎంసీల నీటి నిల్వ ఉన్న సమయంలో, మరమ్మతుల పేరుతో దిగువకు భారీగా నీటిని వదిలేసి ప్రాజెక్టును ఖాళీ చేసేశారు. నిజానికి ఆ సమయంలో కనీస జ్ఞానంతో ఆలోచించి ఉంటే, ఆ నీటితో ఆందోల్ నియోజకవర్గంలోని పరిసర చెరువులు, కుంటలు, కాలువలు, మంజీరా చెక్‌డ్యామ్‌లను ముందుగానే నింపి నిల్వ చేయాల్సింది. కానీ ప్రభుత్వం ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదు. ఫలితంగా నేడు భూగర్భ జలాలు అడుగంటిపోయాయి, జలాశయాలు వట్టిపోయాయి. కోరంపల్లి ఏటా వేల క్వింటాళ్ల మేలైన వరి ధాన్యాన్ని రాష్ట్రానికి అందించే అన్నపూర్ణ లాంటి ఊరు. నది పక్కనే ఉంటుంది కాబట్టి పరిస్థితి మె రుగ్గా ఉంటుందేమో అనుకున్నాం. కానీ గ్రామంలోకి అడుగుపెట్టగానే ఊరి కూడలిలో పదుల సంఖ్యలో రైతులు గుమిగూడి దిక్కుతోచని స్థితిలో ఒకరి బాధలు ఒకరు చెప్పుకొంటున్నారు. దాదాపు 20 మంది రైతులతో కలిసి కిలోమీటరు మేర నడుచుకుంటూ వెళ్తుంటే, అడుగడుగునా ఎండిపోయి న పైర్లు, బీటలు వారిన నేలలే దర్శనమిచ్చాయి. ప్రభుత్వం కరవు మండలాలను ప్రకటిస్తామని చెప్తున్నది కదా.. పంట నష్టాన్ని అంచనా వేయడానికి ఎవరైనా అధికారులు వచ్చారా? అని అడిగితే, ఆ రైతులు చెప్పిన మాటలు ప్రభుత్వ ఉదాసీనతను కండ్లకు కట్టాయి. ప్రభుత్వం తరఫున పలకరించిన దిక్కు లేదని అన్నదాతలు వాపోయారు. ఇవన్నీ క్షేత్రస్థాయిలోని అసలు వాస్తవాలు. చాలా మంది రైతుల పంట మొత్తం ఎండిపోయి పైసా ఆదాయం వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. తీవ్ర కష్టాలకోర్చి పంటను కాపాడుకున్న రైతులకు 50 శాతం కూడా దిగుబడి దక్కలేదు. సాధారణ రైతులే ఎకరానికి దాదాపు రూ.50,000 వరకు అప్పులు చేయగా, కౌలు రైతులకైతే కౌలు రూ.15,000రూ.20,000తో కలిపి మొత్తం రూ.65,000 నుంచి రూ.70,000 వరకు పెట్టుబడి ఖర్చయింది. దీనికితోడు ప్రభుత్వమేమో దొడ్డు వడ్లు వేయొద్దు... సన్న వడ్లే వేయాలి అని రైతులకు ఆదేశాలిచ్చింది. ప్రభుత్వ మాట నమ్మి రైతులంతా సన్న రకాలు సాగు చేస్తే, వాటికి చీడపీడలు, తెగుళ్లు ఎక్కువై పురుగుల మందులకే అదనంగా వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. దిగుబడి మాత్రం సగానికి పడిపోయింది. పాలకుల అనాలోచిత విధానాల వల్ల అన్నదాతలు నష్టపోయారు. ప్రభుత్వాన్ని నిరంతర, నాణ్యమైన విద్యుత్తు అడిగినా వ్యర్థం. కాంగ్రెస్ పాలకులకు అది చేతగాదని అర్థమవుతున్నది. మేడిగడ్డ నుంచే నీళ్లెత్తని అసమర్థ పాలకులు వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేరని స్పష్టమవుతున్నది. కనుక రైతులకు ఉపశమనం కోసమైనా కొన్ని చర్యలు చేపట్టాలి. రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో మండలాల వారీగా సమగ్ర సర్వేలు నిర్వహించి, ఎండిన వరి, దెబ్బతిన్న పత్తి పంటలకు ఎకరాకు కనీసం రూ.25,000 నుంచి రూ.30,000 తక్షణ పరిహారం చెల్లించాలి. రైతులు వేసిన కొత్త బోర్లు, పైప్‌లైన్ల ఖర్చులకు ప్రత్యేక సబ్సిడీ ప్రకటించాలి. తాగు, సాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. రైతులు, కౌలు రైతుల పంట రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేసి, ఈ ఏడాది వడ్డీని మాఫీ చేయాలి. వర్షాభావం తీవ్రంగా ఉన్న అన్ని మండలాలను తక్షణమే అధికారికంగా కరవు మండలాలుగా ప్రకటించి, ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలి. పాలకులు నిర్లక్ష్యంతో రైతులు బలి చేస్తుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. సహాయ చర్యలు చేపట్టకపోతే, రైతుల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున పోరాటానికి దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

ఫుట్‌పాత్‌పై బైక్
నడిపితే 5వేల ఫైన్!



బెంగళూరు (వార్తసంధ్య)అక్టోబర్ 30

బెంగళూరులో ట్రాఫిక్ నిబంధనలు మరింత కఠినతరం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. సగం హెల్మెట్ ధరించే వాళ్లపై ఫైన్లు వేయడంతో పాటు వాటిని అమ్ముతున్న వారిపై, తయారీదారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధం అవుతున్నది.అలాగే ఫుట్‌పాత్‌లపై బైకులు నడిపితే రూ.500 ఉన్న ఫైన్‌ను రూ.5వేలకు పెంచనున్నారు. వన్‌వేపై వెళ్తే వేసే వెయ్యి జరిమానాను రూ.10వేలకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

జీతం 10 వేలు.. ఖాతాలో లక్ష కోట్లు!



సికార్ (వార్తసంధ్య)అక్టోబర్ 30

ఒక మెడికల్ పాయింట్‌లో రూ.10 వేల జీతానికి పనిచేసే యువకుడి బ్యాంక్ ఖాతాలో ఏకంగా రూ.లక్ష కోట్లు కన్పించడంతో అతడు షాకయ్యాడు. రాజస్థాన్‌లోని సికార్‌లో 22 ఏండ్ల సమీర్ ఖాన్ బుధవారం మొబైల్ రీచార్జి చేసేందుకు బ్యాంకింగ్ యాప్ తెరచి తన ఖాతాలో ఏకంగా లక్ష కోట్ల రూపాయల మొత్తం ఉన్నట్టు చూసి షాక్ తిన్నాడు. అంతే కాకుండా ఆ నిధుల ఉపసంహరణపై ఆంక్షలు విధించినట్టు గుర్తించాడు.దీంతో ఖాతాలో ఉన్న రూ.55 వేల సొమ్మును కూడా ఆయన ఉపయోగించుకోలేక పోయాడు. తన యజమానికి విషయాన్ని తెలిపాడు. ఆయనతో కలిసి సైబర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. వారి సూచన మేరకు బ్యాంక్‌ను సంప్రదించగా, సాంకేతిక లోపం కారణంగానే అంత మొత్తం అతని ఖాతాలో జమైనట్టు చూపించిందని చెప్పిన అధికారులు అతని ఖాతాను సరిచేశారు.

వర్షంతో 'ప్రజా అభిశంసన' నేటికి వాయిదా



న్యూఢిల్లీ,
(వార్తసంధ్య)అక్టోబర్ 30

భారత ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా శుక్రవారం ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించాల్సిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమం వాయిదా పడింది. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వాన కురుస్తుండటంతో దీనిని వాయిదా వేసినట్టు కూటమి నేతలు తెలిపారు.సెంట్రల్ ఢిల్లీ, రాజ్‌మార్గ్‌లోని మల్లికార్జున ఖర్గే నివాసంలో శనివారం మధ్యాహ్నం 4 గంటలకు దీనిని నిర్వహించనున్నట్టు చెప్పారు. కూటమిలోని పార్టీల ఏకగ్రీవ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించనున్నారు.

ఢిల్లీ మహా ర్యాలీకి కూకట్‌పల్లి నుంచి కాంగ్రెస్ శ్రేణుల పయనం

- జెండా ఊపి ప్రారంభించిన బండి రమేష్



వార్త సంధ్య కూకట్‌పల్లి:

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కును కాలరాస్తోందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ, ×చీణ×ూ కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ మహా ర్యాలీ' నిర్వహించనున్నారు.అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి మద్దతుగా కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి బయలుదేరారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (గ్రాజజ) ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ జెండా ఊపి ఈ బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. కార్యకర్తలను ఘనంగా సాగనంపి, వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... "ప్రజాస్వామ్యంలో పౌరుల ఓటు హక్కు అత్యంత విలువైనది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగాలి. ఓటర్ల హక్కుల రక్షణ, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ సాగిస్తున్న పోరాటంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాలి" అని పిలుపునిచ్చారు.

భట్టి విక్రమార్క రాజీనామా చేయాలి..
సీపీని వెంటనే బదిలీ చేయాలి!

-సామినేని రామారావు హత్య కేసును పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం ఆగ్రహం..
- దిష్టిబొమ్మల దహనంతో నిరసన

కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 30 (వార్త సంధ్య):

సీపీఎం సీనియర్ నాయకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పాతర్లపాడు మాజీ సర్పంచ్ కామ్రేడ్ సామినేని రామారావు హత్య కేసులో అసలైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం పోలీస్ కమిషనర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సామినేని రామారావు హత్య కేసులో సంబంధం లేని వ్యక్తులను



అరెస్టు చేస్తూ, అసలైన నిందితులను తప్పించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కేసు విచారణను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. ఖమ్మం పోలీస్ కమిషనర్‌ను వెంటనే బదిలీ చేసి, ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. హత్య జరిగి దాదాపు సంవత్సరం కావస్తున్నా, పోలీసుల దర్యాప్తులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విచారణ సాగిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని చట్టాన్ని ఇష్టానుసారంగా దుర్వినియోగం చేయడం ప్రజాపాలనకు విరుద్ధమని అన్నారు. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని, పోలీస్ కమిషనర్‌ను బదిలీ చేసి అసలైన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని, ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ముక్క సీతారాములు, పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు రేకల మంగయ్య, మండల కమిటీ సభ్యులు ముండ్ల ఏకాంబరం, శ్రీరాములు, తిరపయ్య, సైదులు, కోటయ్య, సంపత్, మంద శ్రీను, తగర బాబు తదితరులు పాల్గొన్నారు.

పిసరంత పని.. కొండంత గొప్పలు!

-కాంగ్రెస్ పాలనలో సింగరేణి మండల అభివృద్ధి శూన్యం
-ఎమ్మెల్యే మాటలు కోటలు దాటుతున్నాయి.. సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు: సీపీఎం మండల కార్యదర్శి కే. నరేంద్ర

కారేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 30 (వార్త సంధ్య):

కాంగ్రెస్ పాలకులు పిసరంత పని చేసి కొండంత గొప్పలు చెప్పుకుంటున్నారని సీపీఎం సింగరేణి మండల కార్యదర్శి కే. నరేంద్ర విమర్శించారు. శుక్రవారం కారేపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అభివృద్ధిపై చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులకు పొంతన లేదని ఆరోపించారు.

సీతారామ ప్రాజెక్టు నీళ్లు సింగరేణికి ఎక్కడ?

సీతారామ ప్రాజెక్టు ద్వారా తన హయాంలోనే రూ.100 కోట్లు మంజూరు చేయించి నియోజకవర్గానికి సాగునీరు అందించానని ఎమ్మెల్యే చెబుతున్న మాటలు వాస్తవాలకు విరుద్ధమని నరేంద్ర అన్నారు. వ్యవసాయ మంత్రి సొంత ప్రాంతానికి నీటిని తరలిస్తూ, పిల్లకాలువను వైరా చెరువుకు మళ్లించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. కాలువల నిర్మాణం కోసం వైరా నియోజకవర్గ రైతుల భూములు సేకరించినప్పటికీ వారికి న్యాయమైన పరిహారం అందించలేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు కోసం సింగరేణి మండలంలోని గిరిజన, గిరిజనేతర పేదలు భూములు కోల్పోయినా ఈ ప్రాంతానికి సాగు, తాగునీరు అందడం లేదని



ఆవేదన వ్యక్తం చేశారు. మండలానికి సాగునీరు తీసుకురావడంలో ఎమ్మెల్యే ఎందుకు చొరవ చూపడం లేదని ప్రశ్నించారు.

విద్యారంగంపై పాలకుల నిర్లక్ష్యం

సింగరేణి మండలంలో విద్యారంగ పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, కనీసం డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. బీసీ హాస్టల్, కళాశాల ఎస్ఎం హాస్టల్‌కు సొంత భవనాలు లేకపోవడం, మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికల వసతి గృహాలు లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

వైద్య సేవలు అంతంతమాత్రమే

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీస మందులు కూడా అందుబాటులో లేని పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా (సీహెచ్‌సీ) అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

పోడు రైతులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?

పోడు భూముల కోసం ఎంతో కృషి చేశామని ఎమ్మెల్యే చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని నరేంద్ర అన్నారు. ఎర్రబోడు ప్లాంటేషన్ బాధిత రైతులకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని గుర్తుచేశారు. పోడు భూములపై హక్కులు, విద్యుత్ సౌకర్యం, సాగునీటి బోర్ల కోసం సీపీఎం చేసిన పోరాటాల ఫలితంగానే కొన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోడు భూముల రక్షణకు, సాగుదారులకు హక్కు పత్రాలు అందించేందుకు ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టలేదని విమర్శించారు.

ప్రచార ఆర్భాటం కాదు.. ప్రజలకు అభివృద్ధి కావాలి!

సింగరేణి మండలంలోని సాగునీరు, విద్య, వైద్యం, పోడు భూముల సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని కే. నరేంద్ర డిమాండ్ చేశారు. తాత్కాలిక హంగులు, ప్రచార ఆర్భాటాలకు పరిమితం కాకుండా ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

ఇజ్రాయెల్‌లో తుది ఫలితాలు వెల్లడి..

- ఏ పార్టీకీ దక్కని మెజారిటీ..
- ప్రభుత్వ ఏర్పాటు అసాధ్యమేనా..!

ఇజ్రాయెల్ ఎన్నికల్లో తుది ఫలితాలు వెల్లడయ్యాయి. బుధ, గురువారాల్లో మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. అయితే ఈ ఎన్నికల్లో ఏ కూటమికి, పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల ఫుల్ మెజారిటీ రాలేదు. హంగ్ ఏర్పడింది. మొత్తం 120 స్థానాలకుగానూ ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి ప్రధానమంత్రి నెతన్యాహు నేతృత్వంలోని అధికార కూటమికి 53 సీట్లు దక్కాయి. నెతన్యాహుకు చెందిన 'లికుడ్ పార్టీ 27 సీట్లు గెల్చుకోవడం ద్వారా అతిపెద్ద పార్టీగా నిలిచింది.ప్రతిపక్ష కూటమి 48 స్థానాలు దక్కించుకుంది. అరబ్ పార్టీలు అనూహ్యంగా 19 సీట్లు సొంతం చేసుకున్నాయి. చివరగా లెక్కించిన ఇజ్రాయెల్ మిలిటరీ సిబ్బంది, రిజర్వు సైనికులు, దౌత్యవేత్తలు, ఆసుపత్రుల్లో ఉన్న రోగులు, వైద్య సిబ్బంది, ఖైదీల వంటివారు వేసిన 'డబుల్ ఎన్వలప్ బ్యాలెట్స్‌లో నెతన్యాహు కూటమికి సీట్లసంఖ్య పెరుగుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. కానీ డబుల్ ఎన్వలప్



బ్యాలెట్లతోనూ సమీకరణాలు ఏమాత్రం మారలేదు. ఇప్పుడు హంగ్ ఏర్పడటంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి నెలకొన్నది. 19 సీట్లు దక్కించుకున్న అరబ్ పార్టీలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రస్తుతం అధికారంలో ఉన్న రైట్ వింగ్, ప్రతిపక్ష లెఫ్ట్ వింగ్ కూటములు విముఖంగా ఉన్నాయి. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష కూటములు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలావుంటే ఇజ్రాయెల్ ఎన్నికల్లో విదేశాలు జోక్యం చేసుకున్నాయని ప్రధాని నెతన్యాహు మరోసారి ఆరోపించారు. ఇది 'భూకంపం' వంటి విపత్తు అని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు, అంతర్గత భద్రతా విభాగం దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అరబ్ పార్టీలు ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డాయని విమర్శించారు. ఇజ్రాయెల్ ఇస్లామీకరణకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం తాము అరబ్ పార్టీలతో చేతులు కలపబోమని స్పష్టంచేశారు.

అమెరికాలో 30 ఎకరాల భూమిపై వివాదం..

-కేసు నెగ్గిన మహాత్మా గాంధీ మనవడి ట్రస్టు

సూరత్ (వార్తసంధ్య)అక్టోబర్ 30

మహాత్మా గాంధీ మనవడు కానూ గాంధీకి చెందిన భూమి కేసులో అమెరికా కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఆ భూమిని కబ్జా చేసిన వర్జీనియా నివాసితుడిని అక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని కోర్టు ఆదేశించింది. దివంగత జంట కానూ గాంధీ, ఆయన భార్య శివా గాంధీ తరపున సూరత్‌కు చెందిన పరిమల్ దేశాయ్ అమెరికా కోర్టులో 30 ఎకరాల స్థలం కోసం పోరాటం చేశారు. వర్జీనియాలోని వారెన్ కౌంటీలో ఉన్న



షేనాడోబా నేషనల్ పార్క్ సమీపంలో ఆ స్థలం ఉన్నది. 1987లో కానూ గాంధీ ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే ఆయన తన చివరి దశలో దక్షిణ గుజరాత్‌లో గడిపారు. ఆ సమయంలో ఓ ఛారిటబుల్ ట్రస్టును నమోదు చేసి, దానికి తన ఆస్తులను బదిలీ చేశారు. ఆ ట్రస్టుకు ఇప్పుడు దేశాయ్ మేనేజింగ్ ట్రస్టీగా ఉన్నారు.మెరికాలోని 30 ఎకరాల కేసు గురించి పరిమల్ దేశాయ్ ఓ మీడియాతో వెల్లడించారు. అమెరికా జాతీయుడు గ్రెగరీ బ్లాక్ అనే వ్యక్తి తన ఇంటికి 2025 జనవరి 10న నోటీసు పంపారని, వర్జీనియాలో ఉన్న ఆ భూమి తన పొజిషన్‌లో ఉన్నట్లు ఆ నోటీసులో పేర్కొన్నాడని తెలిపారు. 15 ఏళ్లుగా ఆ స్థలం తన ఆధీనంలో ఉన్నట్లు ఆ వ్యక్తి పేర్కొన్నాడు. అయితే కోర్టులో మాత్రం ఆ విషయాన్ని బ్లాక్ నిరూపించలేకపోయినట్లు పరిమల్ దేశాయ్ మీడియాతో తెలిపారు.

వార్తసంధ్య
www.vaarthasandhya.com

9 రైస్ డిపోలపై దాడులు.. అసలు బియ్యం బాగోతం ఎక్కడ?

మొదటి తరువాయి

అనే అంశాలపై సమగ్ర విచారణ అవసరం.

ఒక్కో డిపోలో ఐదు వేల బస్తాల తనిఖీలు!

తొమ్మిది డిపోలపై జరిగిన తనిఖీల్లో ప్రతి రైస్ డిపో నుంచి సుమారు ఐదు వేల బస్తాలను పరిశీలించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లెక్కన తనిఖీల పరిధి చాలా విస్తృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మొత్తం ఎన్ని బస్తాల్లో తూకం తేడా గుర్తించారు? ఎన్ని బస్తాల్లో సరైన బరువు ఉంది? ఎన్ని బస్తాలను స్వాధీనం చేసుకున్నారు? ఎంత పరిమాణంలో బియ్యాన్ని సీజ్ చేశారు? అన్న వివరాలు ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. కేవలం తనిఖీలు నిర్వహించామని చెప్పడం కాకుండా, వాటి ఫలితాలను గణాంకాలతో ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

పది వేల క్వింటాళ్లకు పైగా నిల్వలు.. అసలు బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది?

తొమ్మిది డిపోల్లో కలిపి పదివేల క్వింటాళ్లకు పైగా బియ్యం నిల్వలు ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేస్తున్నామని వనజాత రెడ్డి తెలిపారు. ఇంత భారీ పరిమాణంలో బియ్యం నిల్వలు ఏ ప్రాంతాల నుంచి వచ్చాయి? ఏ మిల్లుల్లో తయారయ్యాయి? ఏ బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు? బియ్యం కొనుగోలు రికార్డులు, నిల్వల రిజిస్టర్లు, విక్రయ బిల్లులు సక్రమంగా ఉన్నాయా? అన్నది పరిశీలించాల్సి ఉంది. ఈ నిల్వల్లో ఏమైనా ప్రభుత్వ రేషన్ బియ్యం ఉందా? ఉంటే అది ఎక్కడి నుంచి వచ్చింది? రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతోందా? అనే అంశాలపై కూడా ఆధారాలతో విచారణ జరగాలి. అయితే ఇప్పటివరకు ఈ నిల్వలు రేషన్ బియ్యమేనని నిర్ధారణ కాలేదు. అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన.. తొమ్మిది డిపోల యాజమాన్యాలపై కేసులు!

తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలకు సంబంధించి తొమ్మిది డిపోల యాజమాన్యాలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి తప్పుడు బరువులతో బియ్యం విక్రయిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎఫ్ఐఆర్లకు సంబంధించి 11:38 నుంచి 11:44 వరకు కేసు నంబర్లు నమోదైనట్లు సమాచారం అందించారు. అయితే ఈ సంఖ్యల అధికారిక వివరాలు, వర్తింపజేసిన చట్టంలోని సెక్షన్లు, కేసుల ప్రస్తుత స్థితిని సంబంధిత పోలీసులు, పౌరసరఫరాల అధికారులు స్పష్టం చేయాల్సి ఉంది. కేసులు నమోదు చేయడంతోనే బాధ్యత ముగియదు. దర్యాప్తు పూర్తిచేసి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

దాడులు జరిగి మూడు రోజులైనా పూర్తి వివరాలు ఎందుకు లేవు?

కర్మన్ఘాట్లో జరిగిన దాడులు సాధారణ తనిఖీలుగా కాకుండా భారీ స్థాయిలో సాగినట్లు తెలుస్తోంది. పోలీసు, పౌరసరఫరాల, రెవెన్యూ శాఖల అధికారులు రాత్రి పన్నెండు గంటల వరకు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. తొమ్మిది డిపోల్లో తనిఖీలు చేసి, వేలాది బస్తాలను పరిశీలించి, భారీ నిల్వలను గుర్తించినట్లు చెబుతున్న అధికారులు పూర్తి వివరాలను వెంటనే ఎందుకు వెల్లడించలేకపోతున్నారు? తనిఖీల్లో ఎంత బియ్యం తూకం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు? ఎంత బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు? ఎంత విలువైన సరుకు ఉంది? ఎన్ని కేసులు నమోదు చేశారు? అన్న వివరాలు ప్రజలకు తెలియాలి. దాడులు జరిగిన వెంటనే ప్రాథమిక నివేదికను మీడియాకు వెల్లడించి, తదుపరి పూర్తిస్థాయి నివేదికను అందించాల్సిన అవసరం ఉంది.

కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా మారిందా?

రాత్రి వరకు సాగిన తనిఖీలు.. తొమ్మిది డిపోలు.. వేలాది బస్తాల పరిశీలన.. పదివేల క్వింటాళ్లకు పైగా నిల్వల అంచనా.. కేసుల నమోదు.. ఇన్ని జరిగినా అసలు అక్రమాల స్వరూపం ఏమిటో ప్రజలకు తెలియకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇంత పెద్ద స్థాయిలో తనిఖీలు నిర్వహించిన అధికారులు, పట్టుబడిన బియ్యం వివరాలు, తూకం వ్యత్యాసాల లెక్కలు, అక్రమాలపై ప్రాథమిక నివేదికను వెల్లడించకపోవడం ఎందుకు? ఇంతకీ ఈ దాడుల ద్వారా వెలుగులోకి వచ్చిన ప్రధాన అక్రమం ఏమిటి? ఎవరెవరిపై చర్యలు తీసుకున్నారు? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దాడుల హడావుడి మాత్రమే కనిపించి, ఫలితాలు మాత్రం కనిపించకపోతే ప్రజల్లో అధికారుల చర్యలపై నమ్మకం ఎలా ఏర్పడుతుంది?

దాడులు వ్యాపారులను భయపెట్టడానికా? ప్రజలకు న్యాయం చేయడానికా?

రైస్ డిపోలపై దాడులు నిర్వహించడం వెనుక ఉద్దేశం వినియోగదారుల హక్కులను కాపాడటమే కావాలి. తూకంలో తేడాలు, తప్పుడు ప్యాకింగ్, నాణ్యత విషయంలో మోసాలు జరిగితే వాటిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అయితే దాడుల అనంతరం పూర్తి వివరాలు వెల్లడించకపోవడం, పట్టుబడిన బియ్యం వివరాలను ప్రజలకు తెలియజేయకపోవడం అనేక సందేహాలకు తావిస్తోంది. దాడులు కేవలం వ్యాపారులకు హెచ్చరికగా మిగిలిపోతాయా? లేక ప్రజలకు జరిగిన నష్టాన్ని గుర్తించి న్యాయం చేస్తారా? అన్నది అధికారుల తదుపరి చర్యలపై ఆధారపడి ఉంది. కేసులు నమోదు చేసినట్లు ప్రకటించిన అధికారులు వాటి దర్యాప్తు పురోగతిని కూడా వెల్లడించాలి.

రేషన్ బియ్యం రీసైక్లింగ్ జరుగుతోందా?

తనిఖీల్లో గుర్తించిన బియ్యం నిల్వల మూలాలపై ప్రత్యేకంగా విచారణ జరగాలి. ప్రభుత్వ రేషన్ బియ్యం పేదలకు పంపిణీ కావాల్సి ఉండగా, అది అక్రమ మార్గాల్లో మిల్లులు లేదా డిపోలకు చేరుతోందా? అక్కడ పాలిష్ చేసి, ప్యాకింగ్ చేసి ఇతర పేర్లతో మార్కెట్లో విక్రయిస్తున్నారా? అనే అంశాలను అధికారులు పరిశీలించాలి. రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు లేదా రీసైక్లింగ్ జరిగినట్లు ఆధారాలు లభిస్తే సరఫరా గొలుసులో భాగస్వాములైన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలి. అయితే కర్మన్ఘాట్ తనిఖీల్లో పట్టుబడిన బియ్యం రేషన్ బియ్యమేనని ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు. అందువల్ల నిల్వల నమూనాలు, మూలాల రికార్డులు పరిశీలించి నిజానిజాలు



బయటపెట్టాలి.

సన్న బియ్యం పేరుతో దొడ్డు బియ్యం విక్రయాలా?

సన్న బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో దొడ్డు బియ్యాన్ని పాలిష్ చేసి సన్న బియ్యం పేరుతో విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యాన్ని పాలిష్ చేయడం వల్ల దాని అసలు రకం మారిపోదు. అయితే ఏ రకం బియ్యాన్ని ఏ పేరుతో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు? బస్తాపై ముద్రించిన వివరాలు వాస్తవ సరుకుతో సరిపోతున్నాయా? అన్నది పరిశీలించాలి. వినియోగదారుడు తాను కొనుగోలు చేస్తున్న బియ్యం రకం, నాణ్యత గురించి తెలుసుకునే హక్కు కలిగి ఉన్నాడు. బియ్యం నమూనాలను సంబంధిత ప్రయోగశాలలకు పంపించి పరీక్షలు నిర్వహిస్తే వాస్తవ పరిస్థితి బయటపడుతుంది.

మూడు కిలోల బియ్యం మాయమైతే.. లక్షల కిలోల్లో ఎంత నష్టం?

ఒక్కో 26 కిలోల బస్తాలో మూడు కిలోల బియ్యం తక్కువగా ఉంటే, అలాంటి వెయ్యి బస్తాల్లో మూడు వేల కిలోల వ్యత్యాసం ఏర్పడుతుంది. పదివేల బస్తాల్లో ముప్పై వేల కిలోల తేడా వస్తుంది. ఇదే విధంగా పెద్ద మొత్తంలో విక్రయాలు జరిగితే వినియోగదారులకు ఎంతటి నష్టం వాటిల్లుతుందో అంచనా వేయవచ్చు. అయితే వాస్తవంగా ఎన్ని బస్తాల్లో తూకం తక్కువగా ఉందో అధికారులు వెల్లడించిన తర్వాతే మొత్తం నష్టాన్ని లెక్కించగలం. బస్తా బరువు, విక్రయ ధర, తూకం వ్యత్యాసం ఆధారంగా వినియోగదారుల నష్టాన్ని లెక్కించి బాధ్యులను గుర్తించాలి.

కరువు రాకముందే.. పంటలు చేతికి రాకముందే ధరలు ఎందుకు పెరుగుతున్నాయి?

ఎల్నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో వర్షాభావం ఏర్పడి పంటల దిగుబడులు తగ్గవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే రాబోయే ఏడాది కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని భావించి ఇప్పుడే బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? గతంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించి తయారు చేసిన బియ్యం నిల్వలు ప్రస్తుతం ఉన్నప్పుడు వాటి ధరలు ఒక్కసారిగా పెరగడానికి కారణాలేమిటి? కొత్త పంట మార్కెట్లోకి రాకముందే ధరల పెరుగుదల వెనుక సరఫరా, డిమాండ్, నిల్వలు, మిల్లింగ్ ఖర్చులు, మార్కెట్ పరిస్థితులు ఏమేరకు ప్రభావం చూపుతున్నాయో ప్రభుత్వం వివరించాలి. రూ.50 నుంచి రూ.100 వరకు బియ్యం ధరలు.. సామాన్యుడికి భారమే!

కొన్ని రకాల బియ్యం ధరలు కిలోకు రూ.50 నుంచి రూ.100 వరకు చేరుకున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. బియ్యం రకం, నాణ్యత, బ్రాండ్, ప్రాంతాన్ని బట్టి ధరలు మారుతున్నప్పటికీ, నిత్యావసర సరుకైన బియ్యం కొనుగోలు సామాన్య కుటుంబాలకు భారంగా మారుతోంది. గతంలో తక్కువ ధరకు కొనుగోలు చేసిన ధాన్యం నుంచి తయారైన బియ్యానికి ఇప్పుడు అధిక ధరలు ఎందుకు వసూలు చేస్తున్నారు? రైతుకు లభించే ధరకు, వినియోగదారుడు చెల్లించే ధరకు మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకు ఏర్పడుతోంది? అన్నది ప్రభుత్వం పరిశీలించాలి. హోల్సేల్, రిటైల్ ధరలు, మిల్లింగ్ ఖర్చులు, నిల్వల వివరాలను వెల్లడించి ధరల పెరుగుదలపై స్పష్టత ఇవ్వాలి.

బియ్యం వ్యాపారంలో పెద్ద నెట్వర్క్ ఉందా?

ధాన్యం కొనుగోలు నుంచి బియ్యం ప్యాకింగ్, డిపోల్లో నిల్వ, మార్కెట్లో విక్రయం వరకు అనేక దశలు ఉంటాయి. ఈ మొత్తం వ్యవస్థలో ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నాయా? ఎవరు పాలిష్ చేస్తున్నారు? ఎవరు ప్యాకింగ్ చేస్తున్నారు? ఎవరు తక్కువ బరువుతో బస్తాలను మార్కెట్లోకి పంపిస్తున్నారు? అన్నది గుర్తించాలి. కర్మన్ఘాట్లోని తొమ్మిది డిపోలపై జరిగిన దాడులతోనే విచారణ ముగియకూడదు. ఈ డిపోలకు బియ్యం సరఫరా చేస్తున్న మిల్లులు, వ్యాపార సంస్థలు, ప్యాకింగ్ కేంద్రాల వరకు దర్యాప్తు విస్తరించాలి. ఒకవేళ అక్రమ నెట్వర్క్ ఉన్నట్లు ఆధారాలు లభిస్తే దాని మూలాలను వెలికితీయాలి.

అధికారులు, వ్యాపారుల మధ్య ఏమైనా లాలూచీ ఉందా?

దాడులు జరిగిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడించకపోవడం, పట్టుబడిన బియ్యం పరిమాణం, తూకం వ్యత్యాసాలు, కేసుల పురోగతిపై స్పష్టత ఇవ్వకపోవడం ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. సంబంధిత అధికారులకు పూర్తి వివరాలు తెలిసి కూడా వెల్లడించడం లేదా? దర్యాప్తు కొనసాగుతున్న కారణంగానే వివరాలు బయటపెట్టడం లేదా? వ్యాపారులతో ఏమైనా చర్చలు జరుగుతున్నాయా? సెటిల్మెంట్లకు ప్రయత్నాలు జరుగుతున్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులపై లేదా వ్యాపారులపై కుమ్మక్కు ఆరోపణలు చేయడానికి ప్రస్తుతం నిర్ధారిత ఆధారాలు లేవు. ఈ అనుమానాలకు తావులేకుండా అధికారులు తనిఖీల నివేదికలు, కేసుల వివరాలు, తదుపరి చర్యలను పారదర్శకంగా వెల్లడించాలి.

తూనికలు, కొలతల శాఖ ఎక్కడ? రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ఎప్పుడు?

బియ్యం బస్తాలపై ముద్రించిన బరువుకు, వాస్తవ బరువుకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో తూనికలు, కొలతల శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. పౌరసరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీసు, సంబంధిత ఆహార భద్రతా విభాగాలు సమన్వయంతో రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు నిర్వహించాలి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలతోపాటు ఇతర జిల్లాల్లోని రైస్ డిపోలు, మిల్లులు, ప్యాకింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలి. బస్తాల బరువు, నాణ్యత, ప్యాకింగ్ వివరాలు, కొనుగోలు రికార్డులను పరిశీలించాలి. తప్పిదాలు నిర్ధారణైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

బియ్యం ధరలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి

రాష్ట్రంలో బియ్యం ధరలు ఎందుకు పెరుగుతున్నాయి? గత ఏడాది ఇదే సమయంలో ఉన్న ధరలు ఎంత? ప్రస్తుతం ఏ రకం బియ్యం ఎంత ధరకు విక్రయిస్తున్నారు? మిల్లుల్లో ఎంత నిల్వ ఉంది? పౌరసరఫరాల శాఖ వద్ద ఎంత నిల్వ ఉంది? రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం ఎంత? మార్కెట్లోకి వస్తున్న సరఫరా ఎంత? అనే వివరాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంచాలి. ధరల పెరుగుదల, నిల్వలు, సరఫరా, మిల్లింగ్ ఖర్చులు, తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలి. దీనివల్ల ధరల పెరుగుదల వెనుక ఉన్న వాస్తవ పరిస్థితి ప్రజలకు తెలుస్తుంది.

బియ్యం ధరల నియంత్రణకు ప్రత్యేక చట్టం అవసరమా?

నిత్యావసర సరుకుల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. తప్పుడు తూకాలు, తప్పుదారి పట్టించే ప్యాకింగ్, అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం వంటి ఉల్లంఘనలపై ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేయాలి. అవసరమైతే వినియోగదారుల రక్షణ, నిత్యావసర సరుకుల సరఫరా, ధరల పర్యవేక్షణకు సంబంధించి మరింత పటిష్ఠమైన చట్టపరమైన చర్యలను పరిశీలించాలి. అక్రమాలకు పాల్పడినట్లు నిర్ధారణైన సంస్థలపై జరిమానాలు, సరుకు స్వాధీనం, ఇతర చట్టబద్ధ చర్యలు తీసుకోవాలి. బియ్యం వ్యాపారంలో పారదర్శకత తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

దాడులు కాదు.. అసలు దోషులపై చర్యలు కావాలి!

కర్మన్ఘాట్లో జరిగిన తొమ్మిది డిపోల తనిఖీలు రాష్ట్రవ్యాప్తంగా ఒక చర్చకు దారితీశాయి. అయితే ఈ దాడులు కేవలం వార్తల్లో నిలిచే చర్యలుగా మిగిలిపోకూడదు. తూకం తేడాలు ఎందుకు వచ్చాయి? బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? ప్యాకింగ్ ఎవరు చేశారు? ఎన్ని బస్తాల్లో నిబంధనల ఉల్లంఘన జరిగింది? వినియోగదారులకు జరిగిన నష్టానికి బాధ్యులెవరు? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాలి. కేసులు నమోదైతే వాటి దర్యాప్తు ఎక్కడివరకు వచ్చింది? బాధ్యులపై చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? అన్నది కూడా వెల్లడించాలి. అధికారుల చర్యల ఫలితం ప్రజలకు కనిపించినప్పుడే తనిఖీలపై విశ్వాసం పెరుగుతుంది.

వార్త సంధ్య ప్రశ్నలు.. సమాధానం చెప్పాల్సింది ఎవరు?

తొమ్మిది రైస్ డిపోలపై దాడులు నిర్వహించిన అధికారులు పూర్తి వివరాలను ఎప్పుడు వెల్లడిస్తారు? 26 కిలోలుగా ముద్రించిన బస్తాలో 23 కిలోలే ఉన్నట్లు గుర్తించిన బస్తాలు ఎన్ని? పదివేల క్వింటాళ్లకు పైగా నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తున్న బియ్యం ఎక్కడి నుంచి వచ్చింది? పట్టుబడిన నిల్వల్లో రేషన్ బియ్యం ఉందా? సన్న బియ్యం పేరుతో ఇతర రకాల బియ్యం విక్రయిస్తున్నారా? నమోదైన కేసులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు ఎప్పుడు ప్రారంభిస్తారు? దాడుల పూర్తి నివేదికను మీడియాకు ఎందుకు వెల్లడించడం లేదు? అన్న ప్రశ్నలకు పౌరసరఫరాల శాఖ, సంబంధిత జిల్లా అధికారులు సమాధానం చెప్పాలి.

ముఖ్యంగా.. దాడులు జరిగి మూడు రోజులు గడిచినా పూర్తి వివరాలు బయటకు రాకపోవడం ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన ప్రశ్నగా మిగిలింది. అధికారులు ప్రకటించిన రెండు రోజుల గడువులో పూర్తి నివేదిక వస్తుందా? లేక ఈ వ్యవహారం కూడా ఇతర తనిఖీల మాదిరిగా మరుగున పడిపోతుందా? అన్నది వేచి చూడాలి.

వార్త సంధ్య ప్రత్యేక పరిశోధనాత్మక కథనం ....

మరొక కథనం తో మళ్ళీ కలుద్దాం

నిజం నిర్భయంగా మీ ముందుకు

వార్తసంధ్య
www.vaarthasandhya.com


మళ్లీ థియేటర్లలోకి కార్తీ కల్ట్ క్లాసిక్ 'ఆవారా'..

గ్రాండ్ రీ-రిలీజ్ డేట్ ఫిక్స్!



టాలీవుడ్ మరియు కోలీవుడ్‌లో ఎప్పటికీ మర్చిపోలేని కల్ట్ క్లాసిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఆవారా'. హీరో కార్తీ, తమన్నా జంటగా, లింగుస్వామి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించడంతో పాటు తెలుగు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా యువన్ శంకర్ రాజా అందించిన మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసింది. అయితే అప్పట్లో ట్రెండ్ సెట్ చేసిన ఈ బ్లాక్ బస్టర్ మూవీ ఇప్పుడు సరికొత్త హంగులతో మరోసారి థియేటర్లలో సందడి చేయడానికి సిద్ధమవుతోంది. 'ఆవారా 4K' వెర్షన్‌లో డిసెంబర్ 3న గ్రాండ్‌గా రీ-రిలీజ్ కాబోతున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.కేదార్ ఫిల్మ్స్ రిలీజ్ చేస్తున్న ఈ సినిమాని బిగ్ స్క్రీన్‌పై మరోసారి చూసేందుకు కార్తీ అభిమానులు మరియు ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. థియేటర్లలో మరోసారి యువన్ మ్యూజిక్ మానియా, కార్తీ-తమన్నా కెమిస్ట్రీని ఎంజాయ్ చేయడానికి రంగం సిద్ధమైంది!

'కల్ట్'లో కనికరం లేని పోలీస్



'ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలని చేసిన ప్రయత్నమిది. ఈ సినిమా కోసం చాలా ఎక్స్‌పెరిమెంట్స్‌చేశాను. అసలు ఈ సినిమా రాసుకున్నప్పుడు.. ఇది కలలా కాగితంపైనే ఉండిపోతుందేమో అనుకున్నాను.కానీ దీన్ని వెండితెరపైకి తెచ్చిన తారక్ సినిమాస్‌కి ధన్యవాదాలు. ఇది చాలా క్రేజీ సినిమా. ఎక్కడాకాంప్రమైజ్ కాకుండా ఈ సినిమా తీశాను.హై క్వాలిటీ ప్రొడక్ట్‌గా ఇది రానున్నది. సున్నిత మనస్కులు, చిన్న పిల్లలు ఈ సినిమాకు కొంచెం దూరంగా ఉండాలని కోరుతున్నా. ఎందుకంటే ఇదిచాలా వైల్డ్ సినిమా. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టారు. థియేటర్‌లో అంతా ఈ సినిమాను 6.5 సౌండ్‌లో చూడమని కోరుతున్నా' అని చిత్ర దర్శకుడు, కథానాయకుడు విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన స్వీయ దర్శకత్వంలో నటించిన స్లాషర్ థ్రిల్లర్ 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కిన ఈచిత్రం ఈ నెల 30న విడుదల కానున్నది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నటులు కార్తికేయ, తారక్ పొన్నప్ప, యజ్ఞ తుర్లపాటి, అనిరుధ్ కూడా మాట్లాడారు. ట్రైలర్ ఆద్యంతం యాక్షన్, స్లాషర్ ఎలిమెంట్స్‌తో సాగింది. విశ్వక్‌సేన్ ఈ ట్రైలర్‌లో కనికరం లేని పోలీస్‌గా కనిపించాడు.



గోల్డెన్ గ్లామర్‌లో జాన్వీ కపూర్.. అందంతో అదరహో!

సినిమా డెస్క్:

బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ మరోసారి తన గ్లామర్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. వెండితెరపై నటనతో అలరిస్తూనే ఫ్యాషన్ ప్రపంచంలోనూ తనదైన ముద్ర వేస్తున్న ఈ ముద్దుగుమ్మ.. గోల్డెన్ లుక్‌తో అందాల మెరుపులు మెరిపిస్తోంది. బంగారు వర్ణపు దుస్తుల్లో జాన్వీ అందం మరింత ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఆకట్టుకునే హావభావాలు, ఆత్మవిశ్వాసంతో కూడిన పోజులు ఆమె స్టైల్‌కు మరింత వన్నె తెస్తున్నాయి. అలనాటి అందాల తార శ్రీదేవి వారసురాలిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన జాన్వీ కపూర్.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సినిమాలతో పాటు ఫ్యాషన్ ఫొటోషూట్లతోనూ అభిమానులను అలరిస్తోంది. సంప్రదాయ దుస్తుల నుంచి ఆధునిక ఫ్యాషన్ వరకు ఎలాంటి వస్త్రధారణలోనైనా ఆకట్టుకోవడం జాన్వీ ప్రత్యేకత. గ్లామర్‌తోపాటు నటనలోనూ తన ప్రతిభను చాటుకునేందుకు విభిన్న పాత్రలను ఎంచుకుంటోంది. తాజాగా 'కాఫీ విత్ కరణ్' తొమ్మిదో సీజన్‌లో మెరిసిన జాన్వీ.. ప్రముఖ ఫ్యాషన్ సంస్థ మోర్ష్యా రూపొందించిన బంగారు వర్ణపు మినీ డ్రెస్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ దుస్తుల ధర సుమారు రూ.9.3 లక్షలని ఫ్యాషన్ కథనాలు వెల్లడించాయి. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలను పంచుకోవడంతో అభిమానుల దృష్టిని ఆకర్షించాయి.

21 రోజుల్లోనే ఓటీటీలోకి 'కామ్రేడ్ కళ్యాణ్'!

హైదరాబాద్, సినిమా డెస్క్

టాలీవుడ్ యువ కథానాయకుడు శ్రీవిష్ణు నటించిన 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్రం అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 21 రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రావడం విశేషం. అక్టోబర్ 9న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం అక్టోబర్ 30 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమవుతోంది. ఎలాంటి ముందస్తు ప్రకటన లేకుండానే స్ట్రీమింగ్ ప్రారంభం కావడం సినీ అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. థియేటర్లలో ఈ చిత్రాన్ని చూడలేకపోయిన ప్రేక్షకులకు ఇప్పుడు ఇంట్లోనే వీక్షించే అవకాశం లభించింది. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం అందుబాటులోకి వచ్చింది. శ్రీవిష్ణు సరసన మహిమా నంబియార్ కథానాయికగా నటించగా, జనకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహించారు. కోన వెంకట్ సమర్పణలో వెంకట కృష్ణ కర్నాటి, సీతా కర్నాటి నిర్మించిన ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, సత్య తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రేమ, హాస్యం, రాజకీయ సంఘర్షణల మేళవింపుతో రూపొందిన ఈ సినిమా కథ 1990వ దశకంలో ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సాగుతుంది. గ్రామంలో సినిమా థియేటర్ నడుపుకునే తాడికొండ కళ్యాణ్ జీవితంలోకి సితార అనే యువతి ప్రవేశించడంతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ఆమె కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేసేందుకు కళ్యాణ్ తీసుకున్న నిర్ణయం అతడిని అనూహ్య పరిస్థితుల్లోకి నెడుతుంది. సాధారణ యువకుడిగా జీవితం సాగిస్తున్న కళ్యాణ్ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఎలా మారాడు? నక్సలైట్ దళాలతో అతడికి సంబంధం ఏమిటి? ప్రేమించిన యువతి కోసం అతడు ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నాడు? అనే అంశాల చుట్టూ కథ ఆసక్తికరంగా సాగుతుంది. థియేటర్లలో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

'ఛావా' దర్శకుడి కొత్త సినిమా..

శ్రద్ధా కపూర్ 'ఈథా' ట్రైలర్ విడుదల!



బాలీవుడ్‌లో సంచలన విజయం సాధించిన 'ఛావా' చిత్రానికి దర్శకత్వం వహించిన టాలెంటెడ్ డైరెక్టర్ లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఈథా' (జూమ్లు). ప్రముఖ నటి శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. మహారాష్ట్ర సాంస్కృతిక జానపద కళాకారిణి, లావణీ లెజెండ్ వితాబాయి నారాయణ్‌గావ్‌కర్ జీవిత చరిత్ర ఆధారంగా ఈ బయోపిక్ రూపొందుతోంది.ఈ చిత్రంలో శ్రద్ధా కపూర్ వితాబాయి పాత్రలో పరకాయ ప్రవేశం చేసి కనిపించనున్నారు. ఆమె కెరీర్‌లో ఇదొక మైలురాయిగా నిలిచే పాత్ర అని ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. మహారాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే లావణీ నృత్య రూపం మరియు ఒక సాధారణ మహిళా కళాకారిణి అసాధారణ విజయాలు సాధించే ప్రయాణాన్ని ట్రైలర్‌లో అత్యద్భుతంగా హైలైట్ చేశారు. ప్రముఖ నిర్మాత దినేష్ విజాన్ మాడాక్ ఫిలింస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో టాలెంటెడ్ యాక్టర్ రణ్‌దీప్ హూడా కూడా ఒక కీలకమైన పాత్రలో నటిస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచేశారు. ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.